Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 234 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 సెప్టెంబర్ 2023 బుధవారం పేజీలు : 4

## ఈ ఏడాది కూడా ఢిల్లీలో బాణసంచాపై నిషేధం

న్యూఢిల్లీ: వాతావారణ కాలుష్యం అదుపు పేరుతో మరోసారి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశరాజధానిలో అన్ని తరహాల బాణసంచా తయారీ, అమ్మకాలు, నిల్వాలపై తిరిగి నిషేధం విధించింది. వాతావరణ కాలుష్యాన్ని అదుపులో ఉంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, బాణసంచాకు సంబంధించి ఎవరికీ లైసెన్స్‌లు ఇవ్వరాదని ఢిల్లీ పోలీసులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. "ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ గత ఐదేళ్లుగా గణనీయంగా మెరుగుపడింది. అయితే మరింతగా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. ఆ కారణంగానే ఈ ఏడాది కూడా బాణసంచా తయారీ, అమ్మకాలు, నిల్వాలపై నిషేధం విధించాం" అని గోపాల్ రాయ్ తెలిపారు.

# హ్యాట్రిక్ సీఎం కేసీఆర్



## జోస్యం చెప్పిన మంత్రి కేటీఆర్!

హైదరాబాద్ : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి మరింత సానుకూల వాతావరణ ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారకరామారావు స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 90 స్థానాకులపైగా గెలుస్తామని, మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రగతి భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'క్షేత్రస్థాయి నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్ మేరకు.. కేసీఆర్ రాష్ట్రానికి ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు. పది సంవత్సరాలల్లో ప్రభుత్వం అందించిన పథకాలు, సంక్షేమ పనులు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలే అద్భుతంగా వివరిస్తున్నారు. ప్రజలకు చాలా స్పష్టత ఉంది. ప్రతిపక్షాలే అయోమయంలో ఉన్నాయి. కేసీఆర్, బీఆర్ఎస్సే తెలంగాణకు శ్రీరామరక్ష' అన్నారు.

**ప్రతిపక్షాల తాపత్రయం రెండో స్థానం కోసమే..** 'ప్రతిపక్షల తాపత్రయం రెండవ స్థానం కోసమే. సిట్టింగ్‌లకు సీట్లు ఇవ్వకుంటే మా దగ్గరికి వస్తారని ప్రతిపక్షాలు భావించాయి. తాను నిర్మించిన నాయకత్వం, పార్టీ నాయకులపైన తనకున్న నమ్మకం మేరకే కేసీఆర్ సిట్టింగ్ స్థానాలకు సీట్లు ఇచ్చారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారు. 65 సంవత్సరాల్లో ప్రతిపక్షాలు పెట్టిన మెడికల్ కాలేజీలు కేవలం రెండే. కేంద్రం ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు. నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదు. నవోదయ పాఠశాల ఇవ్వలేదు.. ఇతర రాష్ట్రాల్లో ఉన్న అస్థిరత, నాయకత్వ లోపం తెలంగాణలో లేదు. మా ముఖ్యమంత్రి అభ్యర్థి కేసీఆర్. ప్రతిపక్షాల ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో వారికే తెలియదు. ఢిల్లీ నుంచి వచ్చి సీల్డ్ కవర్లు, వారికి అందించే మూటలు మాత్రమే ప్రతిపక్షాల పరిస్థితి. ముఖ్యమంత్రులను మార్చడానికి మత కల్లోలాలను లేపి మరణహోమం సృష్టించి, మనుషులను చంపిన పార్టీ కాంగ్రెస్. తమ పార్టీ నాయకులపైననే చెప్పులు విసిరి పార్టీ కాంగ్రెస్. తెలుగువారి గౌరవం పీవీ నరసింహారావుపైనే చెప్పులు విసిరిన ఘనత కాంగ్రెస్‌ది. ఢిల్లీ బానిస పార్టీలు జాతీయ పార్టీలు. ఆత్మగౌరవం అధికంగా ఉన్న తెలంగాణ ప్రజలు ఈ బానిసత్వ పార్టీలను అంగీకరించరు. తెలంగాణ ప్రజలకు ఢిల్లీ బానిసలు కావాలా ? తెలంగాణ బిడ్డ కావాలా తెలుసుకోవాలన్నారు.

**షర్మిల, కేవీపీ తెలంగాణవాదులమని చెప్పుకుంటున్నరు..** 'కేవీపీ రామచంద్రరావు, షర్మిల, తెలంగాణ వాదులమని చెప్పుకుంటున్నారు.. తెలంగాణ ఇవాళ వారు కాంగ్రెస్‌ను గెలిపిస్తారంట ? తెలంగాణను వ్యతిరేకించిన కేవీపీ, షర్మిల కాంగ్రెస్‌ను తెలంగాణలో అధికారంలోకి తేస్తాం అంటున్నారు. ఇంతటి దుస్థితి కాంగ్రెస్ పార్టీకి పట్టింది. తెలంగాణ ఎమ్మెల్యే పదవి వదిలిపెట్టలేని కిషన్ రెడ్డి, తెలంగాణ ప్రజలపైన రైఫిల్ తీసుకువెళ్లిన రేవంత్ రెడ్డి.. తెలంగాణ కోసం ముసుగులో వచ్చారు. తెలంగాణ వ్యతిరేకతను నరనరాన నింపుకున్న కిరణ్ కుమార్ రెడ్డి, కేవీపీ రామచందర్‌రావు, షర్మిల వంటి తెలంగాణ వ్యతిరేకులంతా ఏకమవుతున్నారు. బహురూపుల వేషాల్లో తెలంగాణపైకి వస్తున్నారు. వీరందరితో తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. పదేళ్ల సాధించిన అభివృద్ధిని, తెలంగాణ వ్యతిరేకుల చేతులు పెడదామా? ప్రజలు తెలుసుకోవాలి. పైకి కనబడేది కిషన్ రెడ్డి ఆడించేది కిరణ్ కుమార్ రెడ్డి. కనబడేది రేవంత్ రెడ్డి ఆడించేది కేవీపీ రామచంద్రరావు . తెలంగాణ ఉద్యమాన్ని కొనుగోలు చేసే ప్రయత్నం చేసి ఉద్యమాన్ని అణిచివేసే ప్రయత్నం చేసిన కేవీపీ రామచంద్రరావు.. ఈ రోజు తెలంగాణ వాదిగా చెప్పుకోవడం మా కర్మ' అంటూ కేటీఆర్ అన్నారు.

**రేవంత్ తెలంగాణ వాది కాదు.. తెలంగాణకు పట్టిన వ్యాధి...** 'రేవంత్ రెడ్డి తెలంగాణ వాది కాదు.. తెలంగాణకు పట్టిన వ్యాధి. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఒకరైన తెలంగాణ ఉద్యమంలో ఉన్నారా? ఒక్కరన్న రాజీనామా చేశారా? కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లుతాయని.. తెలంగాణ ప్రజలు బెదిరించి, మెడలు వంచితే తెలంగాణ ఇచ్చింది. సోనియా ఇచ్చింది అంటే అన్యాయంగా ఉంటుంది. భారతదేశానికి స్వతంత్రం ఇచ్చింది బ్రిటిష్ వారు అని.. బ్రిటిష్ ప్రధాని రిషి సునక్ అంటే ఎంత దరిద్రంగా ఉంటుందో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చింది అంటే అంత దరిద్రంగా ఉంటుంది. నల్ల చట్టాలు తెచ్చిన బీజేపీ కావాలా? జీవితాన్ని వెలుగులు నింపిన భారత **రాష్ట్ర సమితి సర్కారు కావాలా ?...** ఇంత భావ దారిద్ర్యం, లేకితనం కలిగిన ప్రతిపక్షాలతో పోటీపడాల్సి రావడమే ఈ రాష్ట్రం దురదృష్టం. తెలంగాణకు మోడీ ఒక్క పైసా ఇవ్వకున్నా అటు కాంగ్రెస్ అడగదు.. బీజేపీ అడగదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఎక్కడన్నా రూ. 4వేల పెన్షన్ ఇస్తుందా చెప్పాలి. 55 సంవత్సరాల్లో రూ. 200 దాటి పెన్షన్ ఇవ్వని వారు.. 4వేలు ఇస్తం అంటే ఎట్ల నమ్ముతారు ? అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చే కాంగ్రెస్ పార్టీని సోనియా గాంధీ వచ్చి చెప్పినా.. ప్రజలకు కాంగ్రెస్ పాత చరిత్ర తెలుసు'నన్నారు.

**పాలమూరు ప్రాజెక్టుపై కేసులు వేసి అడ్డంకులు..** 'పాలమూరు ప్రాజెక్టుపై కేసులు వేసి అడ్డంకులు సృష్టించిన పార్టీలు ఈ ప్రాజెక్టు ప్రారంభాన్ని ప్రశ్నిస్తున్నాయి. 1963లో నెహ్రూ శంకుస్థాపన చేసిన ఎస్సారెస్పీ కాలువను నిన్నటిదాకా కాంగ్రెస్ నాయకులు ప్రారంభించలేదా ? మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలోని 13,14 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే ఈ ప్రాజెక్టును స్వాగతించాలి. ముఖ్యమంత్రి అభ్యర్థిని కూడా ప్రకటించే ధైర్యం లేని పార్టీలు ఈరోజు మాపైన ఎన్నికల్లో పోటీ అంటున్నాయి. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకొని ప్రయత్నంలో భాగంగా 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' ఓ జిమ్మిక్. ఉద్యమంలో భయపడి రాజీనామా చేయకుండా పారిపోయిన వాడు కిషన్ రెడ్డి. ఇప్పుడు తెలంగాణ గుజరాత్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితా అని కలలు కంటే.. ఎవరూ పట్టించుకుంటారు ? దేశంలో మోదీని మా పార్టీ విమర్శించినంతగా ఏ ఇతర పార్టీ అయినా విమర్శ చేసిందా ? కాంగ్రెస్, బీజేపీ అవగాహనలో ఉన్నాయి. అందుకే బీజేపీని కాంగ్రెస్ నాయకులు విమర్శించరు. మా నాయకులపై దాడులు ఈడీలు దాడి చేశాయి. ఒక్క కాంగ్రెస్ నాయకుడిపైనా కేంద్ర ఏజెన్సీలు దాడులు చేశాయా? ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై మాట్లాడడానికి ఏం లేదు. పక్కరాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై మాకు ఏం సంబంధం లేదు. అది వారి తలనొప్పి. మాకు సంబంధం లేదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## తెలంగాణలో అంగన్వాడీ టీచర్లు, వర్కర్లకు గుడ్ న్యూస్



హైదరాబాద్: తెలంగాణలోని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్వాడీ టీచర్లు, వర్కర్లకు రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్ల రిటైర్మెంట్ వయస్సును నిర్దేశించారు. ఉద్యోగ విరమణ చేసే అంగన్వాడీ టీచర్లకు ప్రత్యేక ఆర్థిక సాయం కింద లక్ష రూపాయలు. అంగన్వాడీ టీచర్లకు లక్ష, హెల్పర్లకు 50 వేలు చొప్పున భృతిని అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే అంగన్వాడీ టీచర్లు, వర్కర్లకు పదవీ విరమణ తర్వాత ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కృతజ్ఞతలు తెలిపారు. మధురనగర్‌లోని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో అంగన్వాడీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ అత్యధికంగా అంగన్‌వాడీల వేతనాలను పెంచారని మంత్రి గుర్తు చేశారు. దేశంలోనే అంగన్‌వాడీలు చేస్తున్న సేవలకు గుర్తింపు ఇచ్చిన రాష్ట్రంగా తెలంగాణ ముందుంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడీలకు అరకొరగా జీతాలు ఇస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు.

## రాములమ్మకు ఎర్త్ పెడుతున్న జీవిత... ఆ నియోజకవర్గంపై కర్చీఫ్?

హైదరాబాద్ : తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మూడు ప్రధాన పార్టీలూ దూకుడు పెంచిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే బీఆరెస్స్ 114 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా... కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థులనుంచి ధరఖాస్తులు స్వీకరించింది. ప్రస్తుతం స్క్రూటినింగ్ పనులు జరుగుతున్నాయని అంటున్నారు. ఈ సమయంలో బీజేపీ సీటు కోసం ధరఖాస్తు చేసుకున్నట్లు చెబుతున్న జీవితా రాజశేఖర్ విషయం హాట్ టాపిక్ గా మారింది. అవును... నటి, దర్శకురాలు జీవితా రాజశేఖర్ బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. అయితే జీవిత ఇప్పటికే పలు పార్టీలు మారారు. కాం గ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీల్లో.. ఈమె తన భర్త రాజశేఖర్ తో కలిసి చేరారు. అయి తే ఎక్కడా వీరికి రాజకీయ ప్రాధాన్యత అయితే లభించలేదు. ఈ సమయంలో బీజేపీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లో యాక్టివ్ అవ్వాలని భావిస్తున్నారని తెలుస్తుంది. ఈ సమయంలో రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్నారని కథనాలొస్తున్నాయి. ఇందులో భాగంగా... అధిష్టాణానికి దరఖాస్తు చేసుకున్నారని అంటు న్నారు. ఇందులో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం నుంచి కమలం గుర్తుపై పోటీ చేయాలని జీవితా రాజశేఖర్ ఆశిస్తున్నారని సమాచారం. అయితే ఈ కూకట్ పల్లి బీజేపీ టిక్కెట్ కోసం విజయశాంతి కూడా ఆశిస్తున్నారని కథనాలొస్తున్న సంగతి తెలిసిందే. ఇం దులో భాగంగా ఆమె ఈ సారి కూకట్ పల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నట్లు చెబుతూ.. అందుకే తనపై బీఆరెస్స్ నేతలు కూకట్ పల్లిలో అక్రమ కేసులు పెడుతున్నారని కథనాలొచ్చాయి. అయితే ఇప్పుడు తాజాగా సినిమా రంగానికే చెందిన జీవితా రాజశేఖర్ కూడా కూకట్ పల్లి సీటు కోసం దరఖాస్తు చేస్తుకున్నారంటూ



వార్తలొస్తున్నాయి. అయితే జీవితా రాజశేఖర్ కేవలం కూకట్ పల్లి నియోజకవర్గం ఒక్కస్థానానికే కాకుండా సికింద్రాబాద్, సనతన్ నగర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలకు కూడా దరఖాస్తు చేసుకున్నారని చెబుతున్నారు. ఇందులో ఫస్ట్ ప్లేస్ మాత్రం కూకట్ పల్లి ఇవ్వాలని, కానిపక్షంలో ఈ మూడు స్థానాల్లో ఏదో ఒక స్థానాన్ని కేటాయించాలని అప్లై చేశారని తెలుస్తుంది. మరి ఈ విషయంపై అధిష్టాణం ఎలా రియాక్ట్ అవుతుందనేది వేచి చూడాలి!




# ప్రస్టేజ్ ఇష్యూ

## పాలమూరు సభ గ్రాండ్ సక్సెస్ కావాల్సిందే!!

## క్యాడర్‌కు దిశా నిర్దేశం చేసిన కేటీఆర్

హైదరాబాద్ : ఈనెల 16వ తేదీన బీఆర్ఎస్ నిర్వహించబోతున్న బహిరంగసభను ఒకరకంగా బలప్రదర్శనగానే అనుకుంటున్నారు. ఎన్నికలకు ముందు పాలమూరులో భారీ బహిరంగసభను నిర్వహించాలని కేసీయార్ గట్టిగా అనుకుంటున్నారు. ఈ సభ నిర్వహణను కేసీయార్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఎందుకంటే ఈనెల 17వ తేదీన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోనియాగాంధి, బీజేపీ నాయకత్వంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణా విమోచన దినోత్సవాన్ని పెద్దఎత్తున జరపబోతున్నాయి. తెలంగాణా విమోచన దినోత్సవం అంటేనే ప్రస్తుత కేసీయార్ ప్రభుత్వానికి వ్యతిరేకమని చెప్పక్కర్లేదు. పై రెండుపార్టీలు ఎలాగూ తెలంగాణా విమోచన దినోత్సవాన్ని భారీ ఎత్తున బహిరంగసభలు జరుగుతున్నాయి కాబట్టి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కూడా భారీ బహిరంగసభ నిర్వహించాలని కేసీయార్ డిసైడ్ చేశారు. తక్కువలో తక్కువ లక్షన్నరమంది జనాలు హాజరు అవ్వాలని ఆదేశాలిచ్చారు జనసమీకరణకు ఎంఎల్ఏలకు ఎంఎల్ఏ అభ్యర్థులు, నేతలకు కేసీయార్ స్పష్టమైన ఆదేశాలిచ్చారట. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసిన పద్దతిలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కూడా పూర్తిచేస్తానని కేసీయార్ హామీ ఇవ్వబోతున్నట్లు పార్టీలో టాక్ నడుస్తోంది. ఈ ప్రాజెక్టు వల్ల ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల సాగునీటి, తాగునీటి అవసరాలు తీరుతాయి. కాంగ్రెస్, బీజేపీలు నిర్వహించబోయే బహిరంగసభకు ధీటుగా జనసమీకరణ జరగాల్సిందే అని కేసీయార్ పట్టుదలగా ఉన్నారు. విచిత్రం ఏమిటంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను ఇరిగేషన్ శాఖ నిర్వహిస్తోంది. అంటే ప్రభుత్వ ఖర్చుతోనే కేసీయార్ షోకులు చేయబోతున్నట్లు అర్థమవుతోంది. తొందరలో జరగబోయే పాలమూరు బహిరంగసభకు సంబంధించి మంత్రి కేటీయార్ సమీక్ష నిర్వహించారు. జనసమీకరణకు సంబంధించే కేటీయార్ ప్రధానంగా ప్రస్తావించారు. ఈ విషయంలో మంత్రులు, ఎంఎల్ఏలు, ఎంఎల్సీలందరు విధిగా భాగస్వాములు అవ్వాల్సిందే అని కేటీయార్ పదేపదే చెప్పారు. జనసమీకరణపైనే ప్రభుత్వంతో పాటు బీఆర్ఎస్ ప్రతిష్ట ఆధారపడుందన్నది అందరికీ తెలిసిందే. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే కేసీయార్ ప్రకటించిన ఎంఎల్ఏ అభ్యర్థులపై ద్వితీయ శ్రేణి నేతలు, క్యాడర్లో విపరీతమైన వ్యతిరేకత పెరిగిపోతోంది.

అలాగే మామూలు జనాల్లో కూడా వ్యతిరేకత స్పష్టంగా కనబడుతోంది. ఇలాంటి నేపథ్యంలో బహిరంగసభ గ్రాండ్ సక్సెస్ అవ్వాలని కేసీయార్ పట్టుదల ఎంతవరకు నెరవేరుతుందో చూడాలి.

# సంపాదకీయం

## లిక్కర్ స్కాం లొంగుబాట్లన్నీ.. ఆప్ ను ఇరికించేందుకే?

తెలుగు రాజకీయాల్లో మొన్నటివరకు ఢిల్లీ లిక్కర్ స్కాం ఓ పెద్ద సంచలనం. అందులోనూ రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధం ఉన్న వ్యక్తుల పాత్ర ఉండడం.. ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తు చేయడంతో పెను దుమారం రేగింది. తమను అణచివేసేందుకే మోదీ ప్రభుత్వం ఢిల్లీ లిక్కర్ స్కాం అంటూ హడావుడి చేస్తోందని.. అసలక్కడ స్కామే లేదని ప్రతిపక్షాలు వాపోయాయి. కానీ, ఎవరి పని వారిదే అన్నట్లు దర్యాప్తు సంస్థలు ముందుకెళ్లాయి.

**ఎమ్మెల్సీ కవిత నుంచి ఎంపీ మాగుంట వరకు :** తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత నుంచి ఏపీ వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి వరకు ఢిల్లీ లిక్కర్ స్కాంలో వినిపించిన పేర్లెన్నో. సౌత్ గ్రూప్ లో మాగుంటకు చెందిన ఇండో స్పిరిట్ కంపెనీది కీలక పాత్ర. ఇక ఈ కేసులో ఎంపీ కుమారుడు రాఘవ్ రెడ్డి సైతం ఉన్నారు. వీరేకాక వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అల్లుడి సోదరుడు, అరబిందో సంస్థలకు చెందిన శరత్ చంద్రారెడ్డి కూడా ఉన్నారు. కాగా, శరత్ చంద్రారెడ్డి అప్రూవర్ గా మారారు. తాజాగా ఎంపీ శ్రీనివాసుల రెడ్డి కూడా అప్రూవర్ అయ్యారు.

**మాగుంట రూ.100 కోట్ల మూట విప్పుతారా? :** ఎంపీ శ్రీనివాసులురెడ్డి అప్రూవర్ గా మారిన నేపథ్యంలో ఆయన "హైదరాబాద్ నుంచి రూ.100 కోట్ల ముడుపుల" ఢిల్లీకి చేరిన వైనంపై నోరిప్పుతారా? అనే ప్రశ్న వస్తోంది. కాగా, సౌత్ గ్రూప్ నుంచి రూ.100 కోట్లను ఢిల్లీ అధికార పార్టీ ఆప్ నాయకుకు అందించి మద్యం విధానాన్ని అనుకూలంగా తయారు చేసుకున్నట్లు సీబీఐ, ఈడీ చార్జిషీట్లలో పేర్కొన్నాయి. ఇందులో ప్రధాన పాత్ర పోషించిన శరత్ చంద్రారెడ్డి, రాఘవ్‌లను ఈడీ అరెస్టు చేసింది. వీరు ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. శరత్‌చంద్రారెడ్డి అప్రూవర్‌గా కూడా మారారు. ఇప్పుడు ఇదే కేసులో మాగుంట శ్రీనివాసుల రెడ్డి అప్రూవర్‌గా మారినట్లు తెలిసింది. సౌత్‌గ్రూప్ నుంచి ఆప్ నేతలకు ముడుపులు ముట్టజెప్పిన విధానానికి సంబంధించిన వివరాలను ఈడీకి అందించడానికి ఆయన అంగీకరించినట్లు సమాచారం. ఈ కేసులో ఇంతవరకూ మాగుంట శ్రీనివాసులురెడ్డి అరెస్టు కాకపోయినా ఆయన ముందుజాగ్రత్తగా అప్రూవర్‌గా మారినట్లు తెలిసింది. దీంతో మున్ముందు ఎవరెవరి పేర్లు బయటికొస్తాయన్న ఉత్కంఠ నెలకొంది.

**ఆప్ ను ఇరికించేందుకే? :** ఢిల్లీలో తమకు కంటగింపుగా మారిన ఆప్ ను ఇరికించేందుకు మోదీ ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. అయితే, ఇప్పటికీ అది సాధ్యం కాలేదు. ఇప్పుడు ఢిల్లీ మద్యం కుంభకోణంలో వరుసగా వ్యక్తులు అప్రూవర్ గా మారుతున్న తీరు చూస్తుంటే కేంద్రం వెనుకనుంచి ఏదో డ్రామా నడుపుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆప్ నేతలను మద్యం కేసులో గట్టిగా ఇరికించేలా పరిణామాలు ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. మనీశ్ సిసోదియాను అరెస్టు చేయడం ద్వారా ఓ విధంగా ఢిల్లీ ప్రభుత్వాన్ని మాత్రమే ఇప్పటివరకు ఈ కేసులో ఇబ్బందిపెట్ట గలిగింది. ఇకపై పార్టీ పరంగానూ దెబ్బకొట్టాలని చూస్తున్నట్లు స్పష్టమవుతోందని చెబుతున్నారు.

## పొట్టకూటికొచ్చి.. ప్రాణాలు విడుస్తూ..!



మిర్యాలగూడ : యాదగిరిగుట్ట మండలం వంగపల్లి పరిధిలో.. ఈ నెల 6న జాతీయ రహదారి విభాగిని మధ్య నీళ్లు పోసే ట్యాంకర్‌ను వెనక నుంచి లారీ ఢీకొట్టడంతో భార్య కళ్లెదుటే భువనగిరి మండలం కేసారానికి చెందిన కాశపాక ఎల్లేష్ నలిగిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. వారు రోజువారీ కూలీలు.. రెక్కాడితే కానీ డొక్కాడని జీవన పరిస్థితులు.. పొట్టకూటి కోసం వచ్చిన వారిని మృత్యువు రూపంలో దూసుకొస్తున్న వాహనాలు కబళిస్తున్నాయి. మొక్కలను బతికించేందుకు వచ్చి రోడ్డుపై బలవుతున్నారు. ప్రమాదాలు అనేకం జరుగుతున్నా.. పరిహారంతో సరిపెడుతున్నారు తప్ప నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలు కనుగొనడం లేదు. ఇప్పటికే పది మంది వరకు హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారి 163పై ప్రమాదాల బారిన పడ్డారు. కొందరు రహదారి సెంట్రల్ మీడియంలోని మొక్కలకు నీళ్లు పోస్తూ మృతిచెందారు. ఇదీ పరిస్థితి.. జాతీయ రహదారికి ఇరువైపులా, విభాగిని మధ్య మొక్కలు, చెట్ల సంరక్షణ చర్యల్లో భాగంగా కూలీలు నీళ్లు పడుతుంటారు. వాటిలో అప్పుడప్పుడు కలుపు తీస్తుంటారు. పనులు జరుగుతున్న సమయంలో కూలీలు రేడియం జాకెట్లు ధరించి ఉండాలి. రోడ్డుపై నిల్చున్న సమయంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలి. స్టాపర్ కోన్‌లు ఏర్పాటు చేసి వాహనదారులు గుర్తించే చర్యలు చేపట్టాలి. ఇక్కడ పని చేస్తున్న కూలీలకు రక్షణ చర్యలు లేకపోవడంతో వాహనాలే వేగంగా దూసుకొచ్చి ఢీకొడుతున్నాయి. డ్రైవర్లు అప్రమత్తమై తప్పించాలనుకున్నా.. వాహన వేగాన్ని నియంత్రించలేక పోతున్నారు. నిబంధనలు పక్కాగా పాటిస్తూ పనులు చేయించాల్సిన సంబంధిత గుత్తేదారులు పట్టించుకోవడం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు కనిపించడం లేదు. మొక్కలు నీళ్లు పట్టేందుకు బిందు సేద్యం పద్ధతి ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా వినియోగించడం లేదు. జాతీయ రహదారి మరమ్మతులు, ఇతర పనులు చేపట్టేప్పుడు ఆ రోడ్డు గుండా వచ్చే వాహనదారులను అప్రమత్తం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి. పక్కకు డైవర్షన్ ఇచ్చేలా 200 మీటర్ల దూరంలో ఎరుపు జెండా పట్టుకొని వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా చూసేందుకు వ్యక్తిని నియమించాలి. జాతీయ రహదారిపైన వాహనం నిలిపి పనులు చేస్తున్న క్రమంలో ఆ దిశగా వచ్చే వాహనాదారులకు కనిపించేలా దూరంలోనే హెచ్చరిక, సూచన బోర్డు ఏర్పాట్లు ఉండాలి.

ఇవీ ఘటనలు గతేడాది మార్చి 6న ఆలేరు బైపాస్ రోడ్డులో జాతీయ రహదారి విభాగిని మధ్యలో కూలీలు మట్టి పోస్తుండగా.. భువనగిరి పురపాలిక పరిధిలోని రాయగిరికి చెందిన తోడికోడళ్లు అంకర్ల వరలక్ష్మి, అంకర్ల కవిత, భార్యభర్తలు ఊరేళ్ల శ్యామ్, ఊరేళ్ల లావణ్య వెనుక నుంచి బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే నలుగురు మృతిచెందారు. ఉదయం నుంచి పనిచేసి మరో గంటయితే ఇంటికి బయలుదేరే సమయానికి విధి పగబట్టింది. బస్సు రూపంలో వీరిని కబళించింది. ఆరునెలల క్రితం భువనగిరి బైపాస్ రోడ్డులో పనులు చేస్తుండగా ఓ కూలీని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. భువనగిరి మండలం అనంతారం క్రాస్ రోడ్డు వద్ద విభాగిని మధ్యలో నీళ్లు పోస్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు.

## అభ్యంతరాలతో ఆగిన ఉపకేంద్రం నిర్మాణం



ఏటూరునాగారం : ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లిలో చేపట్టిన విద్యుత్తు ఉపకేంద్రం పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. అనుమతులు లేవని అభ్యంతరం తెలపడంతో పునాధి పనులను అర్ధంతరంగా ఆపేశారు. బోరు కోసం తీసిన గుంతతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెప్పినా ససేమిరా అన్నారు. వాహనం సీజ్ చేస్తామంటూ బోరు సెట్టు యజమానిని హెచ్చరించారు. దీంతో కేసింగ్ పని పూర్తి చేయకుండానే నిలిపేసి వెనుదిరిగాడు. పిల్లర్ల ఏర్పాటు కోసం తవ్విన గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల తరబడి ఎదురవుతున్న సమస్యలు దృష్టిలో ఉంచుకుని చిన్నబోయినపల్లిలో విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు చేశారు. ఈ సబ్‌స్టేషన్‌తో పూర్తి అటవీ ప్రాంతంలోనే ఉన్న గ్రామాలకు త్రీ ఫేస్ విద్యుత్తు సరఫరా నిరంతరాయంగా అందించే అవకాశం ఉంటుంది. సుమారు 25 కిలో మీటర్ల పరిధిలో 15 గ్రామాల వరకు ఉన్నాయి. నిర్మాణం పూర్తైతే ఆయా గ్రామాలకు దీర్ఘకాలిక విద్యుత్తు సమస్య తీరేది.

కొలిక్కిరాని భూ వివాదం

సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసిన భూమి వివాదం కొలిక్కి రావడం లేదు. అటవీ, రెవెన్యూ శాఖ మధ్య సంవత్సరాల తరబడి ఈ వివాదం కొనసాగుతూనే ఉంది. చిన్నబోయినపల్లి రెవెన్యూ శివారు 98 సర్వే నంబర్‌లో మొత్తం 828.18 ఎకరాల భూమి ఉంది. అందులో కొంత వరకు అడవి విస్తరించి ఉండగా సుమారు 250 ఎకరాల మేర అడవులు లేకుండా ఉండేవి. 35 సంవత్సరాలుగా ఈ భూముల్లో వంద మందికి పైగా రైతులు పోడు భూములని చెప్పి ఆరుతడి పంటలు సాగు చేసేవారు. దశాబ్దకాలంగా రైతులను సాగు చేయనీయకుండా ఆ భూమి అటవీశాఖదేనంటూ అధికారులు అడ్డుకుంటున్నారు. ఈ విషయంలో ధర్నాలు, నిరాహార దీక్షలు పెద్దఎత్తున కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా విద్యుత్తు ఉపకేంద్రం పనులను కూడా అడ్డుకున్నారు. పనులకు ఆటంకం కలిగించొద్దని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కలెక్టర్ చర్యలు తీసుకోవాలి: తుమ్మ సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ, చిన్నబోయినపల్లిసుదీర్ఘకాలంగా అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమవుతు ఒదన్న తరుణంలో అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం సరికాదు. విద్యుత్తు సబ్ స్టేషన్ పనులకు అడ్డు చెప్పొద్దు. ఈ విషయమై పునరాలోచించాలి. కలెక్టర్ మేరకు చర్యలు తీసుకోవాలి.

## ఎక్కడున్నా.. నీ బియ్యం నీకే..!



మిర్యాలగూడ : ఉపాధి, బతుకుదెరువు కోసం ప్రజలు దేశంలోని పలు రాష్ట్రాలకు వలస వెళ్తుంటారు. అలా వలస వెళ్లిన వారు రేషన్ బియ్యం తమ సొంత ప్రాంతంలోనే తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వారు బియ్యం తీసుకోలేక పోయేవారు. వారి కోటా బియ్యం సంబంధిత రేషన్ డీలర్ పక్క దారి పట్టించే అవకాశం సైతం ఉంది. అయితే వీటిని నివారించేందుకు కేంద్రం 'వన్ నేషన్..వన్ రేషన్' పథకాన్ని తీసుకొచ్చింది. మూడేళ్ల క్రితమే ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ.. సాంకేతిక కారణాలతో ఉమ్మడి జిల్లాలో జనవరిలో ప్రయోగాత్మకంగా.. ఫిబ్రవరి నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది. రాష్ట్ర పరిధిలో ఏ ప్రాంతంలో ఉన్న వారైనా వారు ఉన్న చోటే బియ్యం తీసుకునే సదుపాయం ఇప్పటికే అమల్లో ఉంది.

వలస కూలీలకు మేలు..

పలు పనుల నిమిత్తం ఉమ్మడి జిల్లా నుంచి ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు వలస వెళ్తుండగా..బీహార్, ఉత్తరప్రదేశ్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, ఏపీ తదితర ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ పట్టణాలకు వలస వస్తుంటారు. భవన నిర్మాణం, మగ్గం పని, పరిశ్రమల్లో పని చేసే వలస కార్మికులు ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారు. అయితే వీరికి రేషన్ కార్డులు ఉన్నప్పటికీ బియ్యం తీసుకోలేక.. బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. వన్ నేషన్..వన్ రేషన్‌తో వలస వాదుల కష్టాలు తీరనున్నాయి. ఇతర రాష్ట్రాల వారు బియ్యం తీసుకోవాలంటే జాతీయ ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలి. రేషన్ దుకాణంలో ఈ- పోస్ యంత్రంలో వలస వాదుల ఆధార్ సంఖ్య నమోదు చేయగానే ఎన్ఎఫ్‌సీ కార్డు పూర్తి వివరాలు వస్తాయి. వివరాల ఆధారంగా డీలరు బియ్యం అందిస్తారు.

ప్రస్తుతం యూనిట్‌కు 5 కిలోల పంపిణీ..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం 10,08,045 రేషన్ కార్డులు ఉండగా.. ఫిబ్రవరి నెలకు సంబంధించి 16,344.57 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. కార్డుల్లోని ఒక్కో యూనిట్‌కు కేంద్రం ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తుంది. వన్ నేషన్..వన్ రేషన్ పథకం కింద ప్రయోగాత్మకంగా నల్గొండ జిల్లాలో మొత్తం 20 మంది ఇతర రాష్ట్రాల కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. ప్రస్తుతం కేంద్రం ఈ ఏడాది డిసెంబరు వరకు బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తుంది.

వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి- వి.వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి, నల్గొండ

వలస కార్మికుల సంక్షేమ కోసం ప్రవేశ పెట్టిన వన్ నేషన్.. వన్ రేషన్..పథకంలో ఇతర రాష్ట్రాలకు చెందిన ఎన్ఎఫ్‌సీ కార్డు కలిగి ఉన్న ప్రజలు జిల్లాలో ఏ రేషన్ దుకాణంలోనైనా బియ్యం తీసుకోవచ్చు. ఈ అవకాశాన్ని వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి. గత నెలలో జిల్లాలో 20 మంది ఇతర రాష్ట్రాల కార్డు దారులకు బియ్యం పంపిణీ చేశాం. ఈ నెలలో సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

## రాజమార్గం.. సత్వర పరిష్కారం

మెదక్ : వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక. సాధారణంగా కోర్టుల్లో అపరిష్కృత కేసుల పరిష్కారానికి దీన్ని నిర్వహిస్తున్నారు. ఇరువర్గాలకు అవగాహన కల్పించి వారి మధ్య రాజీ కుదిర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యం. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే ప్రధాన ఉద్దేశం. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా సాధారణంగా కోర్టుల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు ప్రీ లిటిగేషన్ సంబంధించినవి వాటికి ప్రాధాన్యం ఇస్తారు. ఇక్కడ తీర్పు ఇచ్చిన కేసులకు మళ్లీ అప్పీలు చేసుకునే అవకాశం లేదు.

ఇరువర్గాల విజయం

లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో కేసులకు మోక్షం లభిస్తే ఇరువర్గాల విజయం సాధించినట్లే. ఇరు వర్గాలకు చెందిన వారు ఓ అవగాహనకు వస్తారు. కాబట్టే ఒకరిది గెలుపు, మరొకరిది ఓటమి అన్నట్లు ఉండదు. మానసికంగా కుంగిపోయే అవకాశం లేదు. అందుకే చాలా కాలం నుంచి న్యాయస్థానం చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ ఉత్తమమైన మార్గమని న్యాయమూర్తులు సూచిస్తున్నారు.

39,714 కేసుల పరిష్కారం



2022లో జిల్లా వ్యాప్తంగా నాలుగు సార్లు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయా కోర్టుల పరిధిలో 39,714 కేసులు పరిష్కరించారు. జిల్లాకేంద్రంలో ప్రత్యేకంగా న్యాయస్థానం ఏర్పాటైన తర్వాత 3 సార్లు కార్యక్రమం జరిగింది. జిల్లా కోర్టు ఏర్పాటు తర్వాత నిర్వహించిన తొలి లోక్ అదాలత్‌లో ఏకంగా ఎప్పుడూ లేనట్లుగా 13,829 కేసులకు మోక్షం దక్కింది. ఆ తర్వాత జరిగిన రెండింటింలో వరుసగా 13,987, 10,224 కేసులు పరిష్కరించారు. జిల్లా పరిధిలోని ఇరువర్గాల కక్షిదారులు ఆయా న్యాయస్థానాలకు వెళ్లి రాజీ కుదుర్చుకుంటున్నారు. కుటుంబ, ఆస్తి వివాదాలు, మోటారు రవాణా, బ్యాంకు రికవరీలు, ఎక్సైజ్, ముందస్తు విచారణ కేసులు, ప్రజా సంబంధమైన వాటిని న్యాయసేవాధికార సంస్థల ద్వారా పరిష్కరిస్తున్నారు.

అవగాహన కల్పించాంలక్ష్మీశారద, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నేడు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాం. ఇప్పటికే న్యాయవాదులు, పోలీసు, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహించాం. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

## నిర్లక్ష్యం.. అభివృద్ధికి ఆటంకం

మెదక్ : మెదక్ మండలం రాయిన్‌పల్లిలో మత్స్యకారులకు 2017లో రూ.5 లక్షలతో సామాజిక భవన నిర్మాణం చేపట్టారు. స్లాబ్ వరకు పూర్తి చేసి వదిలేశారు. ఆ తర్వాత రూ.3 లక్షలు కేటాయించగా.. పనులు కొనసాగలేదు. మండలంలో ఏడు గ్రామాల్లో ఏసీడీపీ నిధులతో సామాజిక భవనాలకు రూ.46 లక్షలు కేటాయించగా, ఇప్పటివరకు కేవలం ఒక్క చోటే పూర్తయింది. ఐదు చోట్ల ప్రారంభం కాకపోవడం గమనార్హం. హవేలిఘనపూర్ మండలం బ్యాతోల్‌లో రూ.5 లక్షలతో ఎస్సీ సామాజిక భవనం నిర్మించారు. స్లాబ్ వేయగా, మిగిలిన పనుల పూర్తికి ఇటీవల అదనంగా రూ.5 లక్షలు కేటాయించారు. ఇంకా పూర్తికాలేదు. పట్టణాలు, పల్లెలో అభివృద్ధి పనులకు శాసనసభ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (ఏసీడీపీ) కింద నిధులు కేటాయించగా పనులు చేపడుతున్నారు. కానీ అరకొర కేటాయింపులతో ఏళ్లుగా అసంపూర్తిగా ఉంటున్నాయి. ఏడాదిలోపు పూర్తిచేయాలనే నిబంధన ఎక్కడా అమలు కాకపోవడం గమనార్హం. కొన్నింటికి నిధులు లేకపోవడం, మరికొన్నింటికి పైసలున్నా సరిపోవనే కారణంతో గుత్తేదారులు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. కరోనా సమయంలో..జిల్లాలో మెదక్, నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గాలతో పాటు ఇతర ఎనిమిది మండలాలు ఆయా నియోజకవర్గాల పరిధిలోకి వస్తాయి. రెండో సారి తెరాస అధికారంలోకి వచ్చాక 2020-21 ఆర్థికసంవత్సరంలో నిధులు కేటాయించగా, కరోనా కారణంగా వాటిని ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారు. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో మంజూరైన నిధులతో ఇప్పటి వరకు పనులు పూర్తి చేయకపోవడం గమనార్హం.

పెంచినా అంతే.. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ఏసీడీపీ నిధుల కోటా పెంచింది. గతంలో రూ.2.50 కోట్లు ఉండగా, రూ.3



కోట్లకు పెంచింది. ఇప్పటి వరకు కేవలం మెదక్ నియోజకవర్గం నుంచి 30 పనులకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు ప్రణాళిక శాఖకు అందాయి. వాటిలో ఇప్పటివరకు రెండు పనులు పూర్తయ్యాయి. నర్సాపూర్ నుంచి ఇంకా ప్రతిపాదించలేదు. నెలన్నర రోజుల్లో ఆర్థికసంవత్సరం ముగియనుంది. ఆలోగా కనీసం పనులైనా ప్రారంభించాల్సి ఉంది.

నామినేషన్ పద్ధతికే మొగ్గుఏసీడీపీ నిధులు రూ.5 లక్షలు దాటితే టెండరు వేయాలి. రూ.5 లక్షల వరకు నామినేషన్ పద్ధతిపై పనులు అప్పగించే అవకాశం ఉంది. దీన్ని కొందరు ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. బినామీ పేర్లతో పనులు చేపట్టడమో, అనుచరులకు అప్పగించడమో చేస్తున్నారు. దీనికి తోడు పంచాయతీరాజ్ శాఖ అంచనాలకు తగ్గట్టుగా నిధులు రాకపోవడం మరో కారణం. ఎంపీ కోటా కింద మంజూరైనవి సైతం పూర్తి కాలేదు.

సకాలంలో పూర్తి చేస్తాం

సత్యనారాయణరెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మెదక్ నియోజకవర్గం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. ఎక్కువగా సామాజిక భవనాలకు కేటాయించాలని సూచించారు. ఇది వరకు సీడీపీ నిధులతో చేపడుతున్న పనుల్లో అసంపూర్తిగా ఉన్న వాటికి నిధులు ప్రతిపాదిస్తే సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

# నిబంధన అమలేదీ?

కరీంనగర్ : జిల్లాలోని నగర, పురపాలికల్లోని బహిరంగ ప్రదేశాల్లో, ప్రజావసరాల కోసం వినియోగించే స్థలాల్లో ఫ్లెక్సీలు, కటౌట్లు, స్వాగత తోరణాలు ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసి ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకునే విధంగా గతంలోనే సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఫలితంగా గతంలో కొంతమేర నియంత్రణ చర్యలు చేపట్టడంలో సఫలీకృతమయ్యారు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పట్టనట్లుగా ఉంటున్నారు.

అనుమతులపై నిర్లక్ష్యం

పురపాలక చట్టం–2019 ప్రకారం నగర, పురపాలికల్లో ప్రచారబోర్డులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌ల ఏర్పాటుకు నిబంధనలు పొందుపర్చారు. పురపాలికల్లో కచ్చితంగా ముందస్తుగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కరోనా వ్యాధి రాకముందు కరీంనగర్‌లో ఫ్లెక్సీ కట్టాలంటే కచ్చితంగా అనుమతి తీసుకునే వారు. లేదంటే వెంటనే రంగంలోకి దిగి తొలగించేవారు. ఫ్లెక్సీ దుకాణాల్లో కూడా ఆదేశాలు జారీ చేశారు. ముందుగా అనుమతి తీసుకొచ్చి ఇస్తే ఆ నంబర్ ముద్రించేలా ఆదేశించారు. పకడ్బందీగా అమలు చేస్తున్న సమయంలో అప్పటి అధికారులు బదిలీ కావడంతో ఆ తర్వాత వదిలేశారు.

ప్రమాదాలకు బాధ్యత ఎవరిది?

నగర ప్రధాన రహదారులు, బైపాసు రోడ్లు, కూడళ్ల పక్కన, హోర్డింగ్‌లపై నిర్లక్ష్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డుకు ఆనుకొని వీటిని కడుతుండగా వాటిపై పేరుగాంచిన ప్రజాప్రతినిధుల పేర్లు, బొమ్మలు ఉండటంతో పట్టణ ప్రణాళిక అధికారులు సైతం చూసీచూడనట్లుగా ఉంటున్నారు. అనుమతులు తీసుకోకుండా అడ్డదిడ్డంగా కడుతుండటంతో అనుకోకుండా జరిగే ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.

బల్దియా ఆదాయానికి భారీగా గండి

నగరంలో వివిధ పార్టీలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఏర్పాటు చేస్తున్న



ఫ్లెక్సీలు, బోర్డులతో బల్దియాకు నయాపైసా రావడం లేదు. రోజురోజుకు ఆదాయం పెంచుకోకపోవడంతో ఖర్చులు పెరిగిపోయి నానావస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్తిపన్ను, నల్లా బిల్లులు, బిల్డింగ్ అనుమతులు, ఎల్ఆర్ఎస్ వంటి ఆదాయం వైపే ఆలోచన చేస్తుండగా ప్రచారం ద్వారా రావాల్సిన మొత్తాన్ని గాలికి వదిలేశారు. నాలుగేళ్లుగా పట్టణాల్లో భారీగా నష్టం జరుగుతుండగా ఆ దిశగా అధికారులు, పాలకవర్గం ఆలోచన చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు రాబట్టుకునేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

నాలుగేళ్ల కిందట

రాష్ట్ర వ్యాప్తంగా అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, తోరణాలు ఏర్పాటు చేస్తే జరిమానా విధించేలా ఆదేశాలు జారీ చేశారు. నగర, పురపాలికల్లో ఎక్కడా వీటిని కట్టాలన్నా ఆలోచన చేసే వారు. అత్యవసరమైతే నిర్ణీత మొత్తాన్ని చెల్లించిన తర్వాతే అధికారులు సూచించిన స్థలాల్లో ఏర్పాటు చేసుకునే వారు.

ఇప్పుడుఅలాంటిది ఏమి లేదు.. పుట్టినరోజు.. శుభాకాంక్షలు.. దుకాణాల ప్రారంభోత్సవాలు.. స్వాగతం పలకడానికి, చనిపోయిన వారికి సంతాపాలు, నివాళులు ఇలా.. ఇష్టానుసారంగా నగర వీధుల్లో దర్శనమిస్తున్నాయి.. నియంత్రణ చర్యలు లేకపోవడంతో ప్రధాన రహదారులు, కూడళ్ల పక్కన ప్రజలకు ఇబ్బందులు కలిగిన పర్వాలేదన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారు.


కార్యాచరణకు ఆదేశాలు..

నగరంలో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల కట్టడికి కార్యాచరణ చేసేలా అదనపు కలెక్టర్, కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ముద్రించే దుకాణాలు, వీటిని కడుతున్న వారికి ముందుగా హెచ్చరికలతో అవగాహన కల్పిస్తాం. ఆ తర్వాత చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

వై.సుభాష్, డీసీపీ, నగరపాలిక, కరీంనగర్

# కార్యాలయాలకు వరద పోటు

కోరుట్ల : కోరుట్ల పట్టణంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదర్శనగర్ లోనున్న తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, రవాణాశాఖ, పంచాయతీరాజ్ డివిజన్, మండల ఇందిరా క్రాంతి పథకం కార్యాలయాల చుట్టూ వరద నీరు పోటెత్తడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆదర్శనగర్ పైప్రాంతంలోనున్న కంచరకుంట పూర్తిగా నిండిపోవడంతో మత్తడి దూకుతుంది. దీంతో వరద నీరు కిందున్న మద్దుల చెరువులోకి వెళ్లేందుకు ఉన్న కాలువలు ఆక్రమణకు



గురికావడంతో ఆదర్శనగర్‌లోని రోడ్లపైనే పారాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడి నుంచి వచ్చిన వరద నీరు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి నిలుస్తోంది.

అధికారులు కార్యాలయాలకు వెళ్లడం కష్టంగా మారింది. పైనున్న కాలనీల చుట్టూ తిరిగి వెళ్తున్నారు. వివిధ ధ్రువపత్రాల కోసం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజలు లోపలికి వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. రవాణాశాఖ కార్యాలయం వెళ్లే రోడ్డు మట్టిరోడ్డు ఉండటంతో వరద నీటి తాకిడికి భారీగా కోతకు గురైంది. భారీ వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ కోసం వచ్చేవారు జాతీయ రహదారిపైనే వాహనాలను ఉంచి ఎంవీఐ రంజిత్‌కుమార్ రోడ్డుపైనే పరీక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ద్విచక్ర వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ కోసం రెండడుగుల మేర ప్రవహిస్తున్న వరద నీటిలోంచి నడుచుకుంటూ వెళ్తున్నారు. నూతన సీసీరోడ్లు నిర్మించేందుకు ఇటీవల మున్సిపల్ అధికారులు నిధులను కేటాయించారు. ఎత్తు పెంచి సిమెంట్ రోడ్లు నిర్మించే వరకు సర్కారు కార్యాలయాలకు వరద పోటు తప్పేలా లేదని అధికారులు పేర్కొన్నారు.

# కాకతీయలో పీహెచ్‌డీ లొల్లి!



వరంగల్ : కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ సీట్ల వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. తమకు పీహెచ్‌డీ సీట్లలో అన్యాయం జరిగిందంటూ విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. మరోవైపు పోలీసులు రంగ ప్రవేశం చేసి విద్యార్థి సంఘాల నేతలపై కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు తమను చితకబాదారని విద్యార్థులు న్యాయస్థానంలో చెప్పడం.. వారిని చికిత్స కోసం ఎంజీఎంలో చేర్పించడం లాంటి వరుస ఘటనలు తీవ్ర దుమారం రేపాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో తప్ప ఎప్పుడూ రిమాండ్‌కు పంపలేదని.. అలాంటిది తమపై కక్షగట్టి రిమాండుకు తరలించారని విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు కేయూకు వచ్చిన అఖిల పక్షం నేతలు అవకతవకలపై విచారణ చేపట్టాలని డిమాండు చేశారు.

విద్యార్థి నేతలకు రిమాండ్

సీట్ల భర్తీలో అవకతవకలు జరిగాయని వీసీ కార్యాలయం ముందు ఆందోళన చేసిన ఏబీవీపీ నేతల్లో ఇద్దరికి గురువారం హనుమకొండ 3వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ రిమాండ్ విధించింది. మరో నలుగురికి పూచీకత్తుపై బెయిలు మంజూరు చేసింది. ఈ ఘటనలో ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. తమను పోలీసులు కొట్టారని విద్యార్థి సంఘాల నేతలు న్యాయమూర్తికి వివరించారు. దీంతో న్యాయమూర్తి వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. దీంతో వారిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు.

కేయూలో నిరసన దీక్ష

విద్యార్థి సంఘాల నేతలకు రిమాండ్ విధించడాన్ని నిరసిస్తూ కేయూలో వివిధ సంఘాల నేతలు నిరసన దీక్ష చేపట్టారు. ఎస్‌డీఎల్‌సీ భవనం ముందు దీక్షను ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రారంభించారు. కేయూ జాక్ ఛైర్మన్ తిరుపతి మాట్లాడుతూ పీహెచ్‌డీ సీట్ల భర్తీలో అక్రమాలు జరిగాయని, విచారణ జరిపించాలన్నారు. ఈ విషయమై ప్రశ్నించిన విద్యార్థులపై దాడి చేయించిన వీసీపై చర్యలు తీసుకోవాలని, దాడులకు పాల్పడిన టాస్క్‌ఫోర్స్ పోలీసులను విధుల నుంచి తొలగించాలన్నారు. యూనివర్సిటీలో నియమించిన ఆంధ్ర రిజిస్ట్రార్‌ను తక్షణమే తొలగించి, న్యాక్ అక్రిడేషన్ పేరుతో కేయూలో జరిగిన అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు రావు పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఏటికేడు తగ్గుతున్న సీట్లు

కేయూలో అధ్యాపకుల సంఖ్య తగ్గే కొద్దీ పీహెచ్‌డీ సీట్లు తగ్గుతున్నాయి. ఒకప్పుడు రెగ్యులర్ అధ్యాపకులు 150 వరకు ఉండగా 330 పీహెచ్‌డీ సీట్లు భర్తీ చేసే వీలుండేది. ఇప్పుడు 90 మంది మాత్రమే ఉండడం.. వారిలో పీహెచ్‌డీ పర్యవేక్షకులుగా అర్హత లేని వారు 30 మంది వరకు ఉండడంతో పర్యవేక్షకుల (గైడ్) కొరత ఏర్పడి పీహెచ్‌డీ సీట్లు గణనీయంగా తగ్గాయి. పీజీ చేసిన వారి సంఖ్య పెరుగుతున్న క్రమంలో పరిశోధన సీట్లు తగ్గడంతో విద్యార్థులు ఆశించి భంగపడుతూ తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వర్సిటీల్లో నియామకాల కోసం ఉమ్మడి నియామక బోర్డు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా ఈ బిల్లుకు ఇంకా ఆమోదం రాకపోవడంతో వర్సిటీల్లో నియామకాలు జరగడం లేదు. ఈ బోర్డు అమల్లోకి వచ్చాక అధ్యాపకుల సంఖ్య పెరిగితే పీహెచ్‌డీ సీట్లు కూడా పెరిగే అవకాశం ఉంది. ఉస్మానియా వర్సిటీలో పీహెచ్‌డీ సీట్ల భర్తీలో పారదర్శకత పాటిస్తున్నారని, ప్రవేశ పరీక్ష పెట్టాక ఇంటర్వ్యూ లేదని, ఇక్కడా అదే విధానం పాటించాలని విద్యార్థులు కోరుతున్నారు.

క్యాటగిరీ 1 కింద రాష్ట్ర అర్హత పరీక్ష, జాతీయ అర్హత పరీక్ష, (నెట్, సెట్)తోపాటు ఎంఫిల్ ఉన్న వారు మార్గదర్శకాల ప్రకారం నేరుగా సీట్లు పొందుతున్నారు. దీనిపై కేయూలో వివాదం లేదు. క్యాటగిరీ 2లో ప్రవేశ పరీక్ష రాసిన వారికి ప్రతిభ, రోస్టర్ ప్రకారం సీట్లు కేటాయించాల్సి ఉంది. రెండో క్యాటగిరీలో పార్ట్‌టైం పరిశోధనలు చేసే ప్రభుత్వం ఉద్యోగులకు పైరవీలతో యథేచ్ఛగా సీట్లు కట్టబెడుతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వివాదం అంతా క్యాటగిరీ 2 చుట్టు తిరుగుతోంది. వీసీ రమేశ్ మాత్రం తాము పూర్తి పారదర్శకతతో సీట్ల భర్తీని పక్కాగా చేస్తున్నామని చెబుతున్నారు.

ఎందుకీ దాపరికం?

కేయూలో పీహెచ్‌డీ సీట్ల భర్తీలో పారదర్శకత లోపిస్తోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఐదేళ్ల తర్వాత గతేడాది 212 సీట్ల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో అనేక విభాగాల్లో పార్ట్‌టైం పరిశోధకులకు అందలం వేసి వారికి సీట్లు కేటాయించారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు రాజనీతి శాస్త్రంలో రోస్టర్ ప్రకారం ఒక విభాగం విద్యార్థికి కేటాయించాల్సిన సీటు ప్రతిభ ఆధారంగా చూస్తే అంతకన్నా తక్కువ మార్కులు వచ్చిన అదే రిజర్వేషన్‌కు చెందిన మరొకరికి ఇచ్చారని చెబుతున్నారు.

ఫార్మసీ సీట్లలో సైతం రాజకీయ జోక్యం ఎక్కువైందని, పలువురు నేతలు చెప్పిన వారికి సీట్లు కట్టబెట్టారని, దీని వల్ల తాము తీవ్ర అన్యాయానికి గురయ్యామని విద్యార్థులు వాపోతున్నారు.

పీహెచ్‌డీ సీట్లు భర్తీ చేసేటప్పుడు ముందే రోస్టర్, కేటగిరీలను నిర్ణయించి వెబ్‌సైట్‌లో పొందుపరచాలని కానీ మార్గదర్శకాలను సైట్‌లో పెట్టకుండా.. అడిగినా స్పష్టత ఇవ్వకపోవడం వెనుక మతలబేంటని ప్రశ్నిస్తున్నారు.

గతేడాది నోటిఫికేషన్ ఇచ్చి చాలా నెలల తర్వాత ఫలితాలు విడుదల చేయడంపై కూడా సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# బియ్యం.. కయ్యం!



కాజీపేట : రాష్ట్ర ప్రభుత్వం గత రబీ, ఖరీఫ్ సీజన్‌లో ఐకేపీల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకున్నారు. వీటిని మరాడించి (కస్టమ్ మిల్లింగ్) కొంత పౌరసరఫరాలకు పోగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి ఈనెల 30లోగా ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. ఇంకా 7.50 లక్షల మెట్రిక్ టన్నులు అందించాల్సి ఉంది.

భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) వద్ద పెద్ద ఎత్తున గోదాములు అందుబాటులో ఉన్నా బియ్యం ఇవ్వడానికి మిల్లర్లు ముందుకు రావడం లేదు. దీంతో పది రోజులుగా కాజీపేట ఎఫ్‌సీఐకి ఒక్క గింజ రావడం లేదు. లారీలు రాక గోదాములు వెలవెల బోతున్నాయి. బియ్యం సేకరణలో అధికారులు కఠిన నిబంధనలు అమలు పరచడం, చిన్న లోపం ఉన్నా తిరస్కరించడం వంటి చర్యల వల్ల మిల్లర్లు వెనుకడుగు వేస్తున్నారు. కొందరు గతేడాది సేకరించిన ధాన్నాన్ని సైతం మరాడించకుండా అలాగే పెట్టుకున్నారు.

ఆధునిక యంత్రం మెలిక..

బియ్యంలో నాణ్యతను పాటించడానికి ఎఫ్‌సీఐ మరో మెలిక పెట్టింది. రైస్‌మిల్లులో సోల్టెక్ అనే యంత్రం ఉంటేనే బియ్యం సేకరిస్తామని చెబుతోంది. బియ్యంలో నల్లని, ఎరుపు, గోధుమ రంగుల్లో గింజలు ఉంటే నాణ్యతా ప్రమాణాల అధికారులు తిరస్కరిస్తారు. ఇందుకుగాను ప్రతి మిల్లు ఈ గింజలను వేరు చేసే సోల్టెక్ యంత్రాన్ని అమర్చుకోవాలని చెబుతోంది. దీనికి రూ.50 లక్షలు ఖర్చు అవుతున్నందున కొందరు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ఈ యంత్రం అమర్చుకున్న మిల్లుల నుంచే సీఎంఆర్ వచ్చింది.

పౌరసరఫరాల వైపే మొగ్గు..

మిల్లర్లు ఎక్కువగా పౌరసరఫరాల శాఖకు బియ్యం ఇవ్వడానికి సుముఖత చూపుతున్నారు. ఇక్కడ నాణ్యత ప్రమాణాల విషయంలో కొంత వెసులుబాటు ఉంటుంది. రైతుల నుంచి ఐకేపీల ద్వారా సేకరించే ధాన్యంపై అనేక ఒత్తిడిలు ఉంటున్నాయి. రైతులను ఇబ్బందులు పెట్టొద్దనే ఉద్దేశంలో నాణ్యత ప్రమాణాల విషయంపై చూసీచూడనట్లు వ్యవహరిస్తారు. దీంతో సివిల్ సప్లై అధికారులు కూడా మిల్లర్ల నుంచి బియ్యం సేకరించేటప్పుడు వారు అందించిన ధాన్యాన్ని బట్టి ప్రమాణాలు చూసుకుంటారు. ఇందంతా అనధికారికంగా జరుగుతుంది. ఎఫ్‌సీఐకి వచ్చే సరికి ప్రమాణాలు కచ్చితంగా పాటించాల్సిందే.

చాలినంత ఖాళీ..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎఫ్‌సీఐకి చెందిన గోదాముల్లో బియ్యం సేకరణకు చాలినంత ఖాళీ ఉంది. బియ్యం ఎక్కువ మొత్తంలో వచ్చినా రైళ్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు పంపడానికి కూడా ఏర్పాట్లు చేసుకుంది. గత నెలలో బియ్యం వచ్చే అవకాశం ఉందని భావించి యశ్వంతాపూర్, రఘునాథపల్లి, గీసుకొండ తదితర ప్రాంతాల్లో గోదాములను తనిఖీ చేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిల్లులు 240

ఇవీ కారణాలు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు మిల్లుల్లో ధాన్యం రూపంలోనే నిల్వలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల ధాన్యం తడిసి నాణ్యత తగ్గింది. ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల రంగు మారొచ్చు. వీటిని బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి తీసుకెళితే అనుమతిస్తారో లేదా తిరస్కరిస్తారో అనే సందిగ్ధంలో మిల్లర్లు ఉన్నారు. కొందరు సీఎంఆర్ ధాన్యాన్ని బియ్యంగా మరాడించి ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు.

ఎఫ్‌సీఐ ఉడకపెట్టిన బియ్యం (బాయిల్డ్ రైస్) తగ్గించి రారైస్ (పచ్చిబియ్యం) సేకరణకు మొగ్గు చూపుతోంది.

# నిషేధం సరే.. వాడుక బెల్లం మాటేమిటి

మిర్యాలగూడ : ఎలుకలు ఉన్నాయని ఇంటినే తగలేసిన చందంగా తయారైంది ఎక్సైజ్ అధికారుల తీరు... గ్రామగ్రామాన మద్యం విచ్చలవిడిగా ప్రవహిస్తున్నా పట్టించుకోని అధికారులు సాధారణ బెల్లంపై నిషేధం విధించారు. సారా తయారీకే బెల్లం విక్రయిస్తున్నారని భావిస్తే కచ్చితంగా అలాంటి వ్యాపారులపై చర్యలకు ఉపక్రమించాలి. కానీ పిండి వంటలు, ఇతర గృహ అవసరాలకు ఉపయోగపడే బెల్లాన్ని పూర్తిగా వద్దనడంపై విమర్శలు వస్తున్నాయి. మద్యపానం ఆరోగ్యానికి హానికరం అంటూ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అయినా అక్రమంగా, విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయి. దాబాల్లో మూడు పువ్వులు–ఆరు కాయలుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా నిరోధించే ధైర్యం లేదు. ఆరోగ్యానికి మేలు కలిగించే బెల్లం అమ్మకాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని కృష్ణపట్టెలో అన్ని ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉండగా, అడవిదేవులపల్లి, దామరచర్ల మండలాల్లో మరింత ఎక్కువగా ఉంది. విక్రయిస్తే రూ.2 లక్షలు జరిమానా కట్టాల్సి



వస్తుందని తహసీల్దార్ ముందు వ్యాపారులను హాజరుపర్చి బైండోవర్ చేశారు. విక్రయాల నియంత్రణకు నిబంధనలు విధించారు. దీంతో ఎందుకీ తలనొప్పి అని వారు బెల్లం అమ్మకాలను పూర్తిగానిలిపేశారు. శ్రావణమాసం, వినాయకచవితి, దసరా, దీపావళి పండగల సీజన్.. బెల్లంతో తీపి వంటలు చేసుకొని రుచి చూడాలని అనుకున్న వారికి నిరాశ మిగులుతోంది.

నిషేధం ఎందుకంటే..నాటు సారా తయారీలో బెల్లం కీలకం. అందుకే పెద్దఎత్తున దొంగతనంగా సారా వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు. సారా తయారు చేసే వారిపై చర్యలు మానేసి అందులో కలిపే బెల్లం అమ్మేవారిపై సరికాదని పలువురు వాపోతున్నారు. కృష్ణపట్టె ప్రాంతాల్లో ఇంటి అవసరాలకు బెల్లం అమ్ముదామన్నా వ్యాపారులు భయపడాల్సిన పరిస్థితి ఉంది. శ్రావణమాసం, తరువాత వచ్చే గణేశ్ ఉత్సవాలు, గ్రామ దేవతల పండగలకు తీపి వంటకాలు చేయాలంటే మార్కెట్లో బెల్లం కొరత కనిపిస్తోంది. సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లమే కాకుండా సాధారణంగా అమ్మే రకాలకూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఐరన్ లోపం ఉన్న బాలింతలు, పౌష్టికాహార లోపం ఉండే పిల్లలకు బెల్లంవాడాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు దొంగచాటుగా ఆంధ్రా ప్రాంతం నుంచి బెల్లం దిగుమతి చేసుకొని రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. బెల్లం అక్రమ రవాణా నిరోధించి నాణ్యమైన బెల్లాన్ని సామాన్యులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కావాలని ఇబ్బంది పెట్టడంలేదు

మహేశ్వర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, మిర్యాలగూడ

బెల్లం అమ్మకాలపై నిషేధం లేదు. సారా తయారీకి విక్రయిస్తేనే కేసులు నమోదు చేస్తాం. బెల్లం అమ్మే వ్యాపారులందరినీ బైండోవర్ చేశాం. దీంతో కొందరు అమ్మకాలను నిలిపివేశారు. కొన్నవారి పేర్లు, ఫోన్ నెంబర్ సేకరించి బెల్లం విక్రయించుకోవచ్చు. తక్కువ మోతాదులో సరకు తెచ్చుకొని అవసరమైన వారికి విక్రయించుకోవచ్చు.

# ఐదేళ్లయినా సొంత భవనాలు సున్నా

నల్గొండ : ఎస్సీ వసతి గృహంలో తహసీల్దారు కార్యాలయం.. రైతు వేదికలో వ్యవసాయశాఖ కార్యాలయం.. అద్దె భవనంలో పోలీస్ స్టేషన్.. ఇతర శాఖలు. ఇదీ నల్గొండ ఉమ్మడి జిల్లాలోని కొత్త మండలాల పరిస్థితి. పరిపాలన సౌలభ్యం, ప్రజలకు వేగంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసి అయిదేళ్లయినా పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో, తహసీల్దారు, ఎంపీవో, వ్యవసాయ, తదితర శాఖల కార్యాలయాలకు నేటికీ సరైన వసతి సమకూరలేదు. శిథిల భవనాలు, ఇరుకు గదులు, ఇతర విభాగాల కార్యాలయాల్లో సర్దుకుని పరిపాలన కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా... అద్దె చెల్లింపులకు నిధులు విడుదల కాకపోవడంతో యజమానులు ఖాళీ చేయిస్తున్నారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అయిదేసి, యాదాద్రి భువనగిరి జిల్లాలో రెండు మండలాలు కొత్తగా ఏర్పడ్డాయి. ఇదే పరిస్థితి నెలకొంది.

కార్యరూపం దాల్చని భవన నిర్మాణాలు

కొత్త మండలాల్లో కార్యాలయ వసతి సమస్యను అధిగమించేందుకు ఒక్కో భవనానికి రూ.కోటి చొప్పున వెచ్చించి సమీకృత కార్యాలయ భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనాల్లో తహసీల్దారు, ఎంపీడీవో, ఎంపీవో కార్యాలయాలు పని చేయాలని సూచించింది. ఈ ప్రతిపాదన తీసుకొచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికి అవసరమైన భూముల సేకరణ జరగలేదు. మండల కేంద్రాల్లో ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వ భూములు లేకపోవడంతో నిర్మాణాలకు పునాదులు పడలేదు.

ప్రాథమిక వైద్య సేవలకు దూరం

కొత్తగా ఏర్పాటైన మండలాల్లో ఇప్పటి వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఈ మండలాల్లోని గ్రామాల ప్రజలు పాత మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్తగా ఏర్పడిన మాడ్గులపల్లి, నేరెడుగొమ్ము, తిరుమలగిరి సాగర్, మద్దిరాల, చింతలపాలెం మండలాల్లో ఇంకా ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి రాలేదు. నేరడుగొమ్ము మండల ప్రజలు వైద్య సేవలకు చందంపేట, దేవరకొండకు వెళ్లాల్సివస్తోంది.

అద్దె చెల్లింపు అంతంత మాత్రమేకొత్త మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలను ఇతర శాఖల భవనాల్లో నిర్వహిస్తున్నారు. కొన్ని మండలాల్లో ఆ వసతి కూడా లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహించాల్సి వస్తోంది. అయితే అద్దె భవనాల్లో నడిపే కార్యాలయాలకు ప్రతి నెలా అద్దె యజమానులకు చెల్లించేందుకు అందుబాటులో నిధులు సమకూరడం లేదు.

# ముందుకు సాగని దోబీఘాట్ల పనులు

జనగామ : కుల వృత్తులపై ఆధారపడిన బలహీన వర్గాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోంది. కొందరికి రుణాల అందజేత, కొన్ని వృత్తుల వారికి ఉచిత విద్యుత్తు సరఫరా తదితర రూపాల్లో చేయూతనిస్తోంది. ఈ క్రమంలో రజక వృత్తిలో వచ్చిన ఆధునిక సాంకేతికతను వారు అందిపుచ్చుకునేందుకు ఓ కార్యక్రమాన్ని ప్రారంభించింది. పట్టణ, స్థానిక సంస్థల పరిధిలో రజకుల ఆర్థికాభివృద్ధికి మరో పథకానికి శ్రీకారం చుట్టింది. దుస్తులను ఉతికే పనిలో రజకులు పడే ఇబ్బందులను దూరం చేసేందుకు ఒక్కో పురపాలికలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో అధునాతన దోబీఘాట్‌లను నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని తొమ్మిది పురపాలికలకు దోబీఘాట్ ప్రాజెక్టులు మంజూరయ్యాయి. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో స్మార్ట్‌సిటీ పథకంలో ఒక్కోటి రూ.3 కోట్ల వ్యయంతో రెండు యూనిట్లు మంజూరు కాగా ఒకటి ప్రారంభానికి సిద్ధమైంది. ఇతర పురపాలికల్లో నాలుగు మాసాల క్రితం టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కొన్ని చోట్ల పనులు ప్రారంభమై నిలిచిపోగా, మరికొన్ని చోట్ల పునాది రాయి కూడా పడలేదు. మంజూరైన పథకాలను పట్టాలెక్కించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

గ్రాంటు రూపేణా రూ.2 కోట్ల నిధులు

పురపాలికల పరిధిలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అధిక నిధులను మంజూరు చేస్తోంది. తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీయూఎఫ్ఐడీసీ) ద్వారా ఒక్కో పురపాలి



కలో దోబీఘాట్ నిర్మాణానికి రూ.2 కోట్ల చొప్పున మంజూరయ్యాయి. ఏడాది క్రితం కసరత్తు ప్రారంభం కాగా, ఆరు మాసాల క్రితం ఐదు నుంచి ఏడు గుంటల స్థల సేకరణ పూర్తయింది. టెండర్ల ప్రక్రియ నిర్వహించారు.

స్థల సేకరణ దశలోనే..జనగామలోని వీవర్స్ కాలనీలో సుమారు 1000 గజాల స్థలాన్ని ఇందుకోసం ప్రతిపాదించారు. పట్టణ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ల పర్యవేక్షణలో పుర కమిషనర్, ప్రజారోగ్యశాఖ ఈఈతో కూడిన కమిటీ స్థలాన్ని ఎంపిక చేయగా కలెక్టర్ ఆమోదం తెలిపారు. మే మాసంలో టెండర్ల ప్రక్రియ నిర్వహించగా, పట్టణానికి చెందిన ఓ గుత్తేదారుకు టెండరు ఖరారైంది. ఎంపిక చేసిన స్థలంలో విద్యుత్తు తీగలు అడ్డుగా ఉన్నాయనే కారణంతో పనులు ప్రారంభించలేదు. విద్యుత్తు లైన్ల మార్పిడికి రూ.1.50 లక్షలు అవసరమని మే మాసంలో కౌన్సిల్ ఆమోదం తీసుకున్నారు. రెండు లైన్లను మార్చేందుకు రూ.2.96 లక్షలు అవసరమని విద్యుత్తు అధికారులు సూచించడంతో, ఆగస్టులో కౌన్సిల్ సమావేశంలో అదనపు వ్యయానికి ఆమోదం పొందారు. వెంటనే లైన్ల మార్పిడి ప్రక్రియను పూర్తి చేయించాల్సి ఉంది. టీయూఎఫ్ఐడీసీ పథకంలో చేపట్టే పనులకు సకాలంలో బిల్లులు మంజూరు కావడం లేదని, ఈ కారణంగానే గుత్తేదారు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది.

అసంపూర్తిగా .. మహబూబాబాద్ పట్టణంలో ఎంపిక చేసిన స్థలంలో పనులు ప్రారంభించిన తర్వాత, స్థలం విషయంలో వివాదం ఏర్పడగా పనులు నిలిపివేశారు. మరిపెడలో సేకరించిన స్థలం వివాదాస్పదం కావడంతో పనులు మొదలు కాలేదు. భూపాలపల్లిలో కేటీకే 6వ గని సమీపంలో స్థలాన్ని సేకరించారు. టెండరు దశ ముగిసింది. నిర్మాణ పనులు పట్టాలెక్కలేదు. తొర్రూరులో ఇటీవలే మంత్రి దయాకర్‌రావు శంకుస్థాపన చేశారు. వర్ధన్నపేటలో స్లాబ్ దశలో ఉంది. నర్సంపేట ఎన్టీఆర్‌నగర్‌లో దోబీఘాట్ నిర్మాణం చేపట్టారు. పునాది దశ దాటగా స్తంభాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. డోర్నకల్ పురపాలికలో దోబీఘాట్ పనులు స్లాబ్ దశకు చేరాయి. పరకాలలో దోబీఘాట్ నిర్మాణానికి స్థలాన్ని సేకరించారు. టెండర్ ప్రక్రియ ముగిసింది. పనులను మొదలు పెట్టాల్సి ఉంది.

నిర్మాణం పూర్తయితే120 కిలోల సామర్థ్యంతో నిర్మించనున్న దోబీఘాట్‌లో ఒక రోజులో 8 గంటల పాటు ప్లాంటును నిర్వహిస్తే 1940 దుస్తులను ఉతికి, ఆరబెట్టవచ్చు. ఒకరోజుకు రూ.40 వేల విలువైన పనులు చేపడితే నెలకు రూ.12 లక్షల ఆదాయం లభిస్తుందని అంచనా. ఇందులో రూ.2 లక్షలు నిర్వహణ వ్యయం కాగా, వృత్తిదారులకు నెలకు రూ.10 లక్షల సమష్టి ఆదాయం లభిస్తుందని అంచనా. బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రకటించిన పథకం పనులను ప్రారంభించాలని వృత్తిదారులు కోరుతున్నారు. ఎన్నికల హడావిడి, టికెట్ల పర్వంలో అభివృద్ధి పనులను విస్మరిస్తే, ఆ తర్వాత పనులు పట్టాలెక్కవేమోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్తు తీగలను తొలగించిన తర్వాత– మహిపాల్, ఇన్‌ఛార్జి కమిషనర్‌జనగామలో దోబీఘాట్‌కు ఎంపిక చేసిన స్థలంలో ఒక వరుస తీగల తొలగింపు పనులు పూర్తయ్యాయి. మరో లైన్ మార్పిడి పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ అంశం కౌన్సిల్, ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది.

# వ్యర్థాలు గాలికి.. వ్యాధులు జనానికి!

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో జీవ వ్యర్థాల నిర్వహణపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాధారణ వ్యర్థాల నుంచి జీవ వ్యర్థాలను వేరు చేసి ప్రత్యేక గదిలో భద్రపరచాల్సి ఉంటుంది. అయితే ఎమర్జెన్సీ వార్డు సమీపంలోని పాత మార్చురీ వద్ద ఆరుబయటే జీవ వ్యర్థాల కవర్లను పడేస్తున్నారు. అక్కడున్న డబ్బాలను పక్కకు పడేసి జీవ వ్యర్థాల మూటలను ఇలా పడేయడంతో కవర్లు చిరిగి వ్యర్థాలు బయటకు వస్తున్నాయి. తరలింపులోనూ తీవ్ర జాప్యం చేస్తున్నారు. జీవ వ్యర్థాలకు గాలికి వదిలేయడంతో రోగులకు, పర్యావరణానికి శాపంగా మారింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దుర్గంధం వెదజల్లుతోంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జీవ వ్యర్థాల నిర్వహణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకాలేవీ ?



బచ్చన్నపేట : జిల్లాలో పంచాయతీ పాలకవర్గాలు కొలువుదీరి నాలుగున్నరేళ్లవుతోంది. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందనే ఆశతో ప్రజలు పలు పంచాయతీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేటికీ ప్రభుత్వం నజరానా అందించకపోవడంతో ఆ పంచాయతీల పాలకవర్గాలు నిరాశ చెందుతున్నారు. ప్రోత్సాహక నిధులతో గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించుకోవచ్చని, అభివృద్ధి పనులు చేపట్టవచ్చనే ఉద్దేశంతో ప్రజలు ఐక్యతారాగాన్ని వినిపించారు. గతంలో ఏకగ్రీవ పంచాయతీలకు రూ.7 లక్షల నజరానా మాత్రమే అందేది. ఈ సారి ప్రభుత్వం దాన్ని రూ.10 లక్షలకు పెంచింది. ఎమ్మెల్యే నిధుల నుంచి మరో రూ.5 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మొత్తం రూ.15 లక్షల ప్రోత్సాహకాలు అందుతాయని సంబరపడ్డారు. ప్రభుత్వం దాని ఊసే ఎత్తకపోవడంతో నజరానా కోసం ఎదురు చూపులు తప్పడం లేదని ఏకగ్రీవ పంచాయతీల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి జిల్లాలోని 281 పంచాయతీలు ఉన్నాయి. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి 58 పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నారు. ఒక్కో పంచాయతీకి రూ. 15 లక్షల చొప్పున మొత్తం రూ.8.7 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి అందాల్సి ఉంది. ఇప్పటికే నిధులు లేక ఆ పంచాయతీలు ఇబ్బంది పడుతున్నాయి. ప్రోత్సాహక నిధులను ఇవ్వకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదు. నిధుల లేమితో కనీసం విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది. సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గ్రామాభివృద్ధి కుంటుపడుతోందని ప్రజాప్రతినిధులు, ప్రజలు వాపోతున్నారు.

కొత్తగా ఏర్పడినవే అధికం..జిల్లాలో కొత్తగా ఏర్పడిన పంచాయతీలే అధికంగా ఏకగ్రీవమయ్యాయి. ఓటర్లు తక్కువగా ఉండటం, చిన్న పంచాయతీలు కావడంతో సమష్టి నిర్ణయంతో పాలకవర్గాలను ఏకగ్రీవం చేసుకున్నారు. ప్రభుత్వ పరంగా గ్రామానికి నజరానా వచ్చే అవకాశాలు ఉండటంతో పల్లెల్లో ఒకే మాటగా నిలిచారు. అంతకు ముందు ఉమ్మడి పంచాయతీల వల్ల మౌలిక సదుపాయాలకు నోచుకోకపోవడంతో కలిసి కట్టుగా నిలిచారు.

సమస్యలివి..గ్రామాల్లో ప్రధానంగా అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మురుగుకాల్వలు లేకపోవడంతో మురుగునీరు రహదారిపై పారుతోంది. పూర్తిస్థాయిలో తాగునీరు అందక ప్రజలు అల్లాడిపోతున్నారు. కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు భవనాలు లేకపోవడంతో చెట్లకింద, పాఠశాల భవనంలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏకగ్రీవ పంచాయతీలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. నిధులు విడుదలైతే పలు అభివృద్ధి పనులతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. వాటి కోసం సర్పంచులు, ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు రాలేదు– రఘురామకృష్ణ, ఎంపీడీవో, బచ్చన్నపేట
ఏకగ్రీవ పంచాయతీలకు నజరానా అంశానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే విడుదల చేస్తాం.

# పోటీ తీవ్రం.. ఎవరికి దక్కేనో కమలం

ములుగు : రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. ములుగు నియోజకవర్గంలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఇప్పటికే అభ్యర్థిని ఖరారు చేయడంలో.. భారాస ముందంజలో ఉండగా.. కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేనే మళ్లీ బరిలోకి దించుతారనేది వాస్తవం. ఈ రెండు పార్టీల నుంచి అభ్యర్థుల కేటాయింపు సమస్య దాదాపు పూర్తవగా, మూడో ప్రధాన పార్టీ భాజపాలో రెండు సామాజిక వర్గాలపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. భాజపాలో టికెట్ కోసం విపరీతమైన పోటీ నెలకొంది. ములుగు అసెంబ్లీ నియోజకవర్గాన్ని గిరిజనులకు కేటాయించిన విషయం తెలిసిందే. టికెట్ కేటాయింపులో ప్రతిసారి రెండు సామాజిక వర్గాలు టికెట్ కోసం పోటీ పడడం సహజంగా మారింది. ఇందులో భాగంగా ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన బడే నాగజ్యోతిని భారాస అభ్యర్థిగా, అదే సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే సీతక్కలు కాంగ్రెస్ నుంచి బరిలో ఉండనున్నారు. ఈ రెండు పార్టీలు ఆదివాసీ సామాజిక వర్గం, అందులోనూ మహిళలకు కేటాయించడంతో భాజపాలో చర్చ జరుగుతోంది. ఆదివాసీ సామాజిక వర్గం నుంచి అభ్యర్థిని ఖరారు చేయాలా?, లంబాడా సామాజిక వర్గం నుంచి ఖరారు చేయాలనే దానిపై పార్టీలో సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు సమాచారం.

రెండు సామాజిక వర్గాలపై దృష్టి..
నియోజకవర్గంలో ఆదివాసీ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో.. కాంగ్రెస్, భారాసలు అభ్యర్థిని ఖరారు చేసిన విధంగానే భాజపా కూడా ముందుకుపోతే ఎలా ఉంటుందనే కోణంలో ఆలోచిస్తున్నట్లు వినికిడి. అలా కాకుండా లంబాడా సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి టికెట్ ఇస్తే ఆ వర్గంలోని అత్యధిక ఓట్లు భాజపాకు కలిసివచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. రెండు సామాజిక వర్గాలను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థిని ఖరారు చేయాల్సిన పరిస్థితి.

నియోజకవర్గం నుంచి ఐదుగురు..నియోజకవర్గంలో గతం నుంచి పార్టీలో పని చేస్తున్న ఐదుగురు టికెట్ కోసం ఎదురు చూస్తున్నారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా జవహర్‌లాల్, భాజపా అనుబంధ రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి తాటి కృష్ణ, భాజపా రాష్ట్ర పాలసీ అండ్ రిసెర్చ్ కమిటీ కన్వీనర్ రాజు నాయక్, మాజీ మంత్రి పోరిక జగన్నాయక్ తనయుడు పోరిక ఉత్తంకుమార్‌లు టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పటికే కృష్ణవేణి నాయక్, జవహర్‌లాల్, తాటి కృష్ణ, రాజు నాయక్‌లు అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్ తనయుడు అజ్మీరా ప్రహ్లాద్ ఈనెల 12న భాజపా తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అదే విధంగా ములుగు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన విశ్రాంత అధికారి(మున్సిపల్ కమిషనర్) దేవ్‌సింగ్ కూడా టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన తాటి కృష్ణ మినహాయిస్తే మిగిలిన వారంతా లంబాడా వర్గానికి చెందిన వారే.

# పోడు పట్టాల్లో అక్రమాలు వారి చలువే?



నర్సంపేట : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోడు పట్టాల పంపిణీలో జరిగిన అవకతవకలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. బీటు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఆర్‌సీ కమిటీ.. వీరి చేతివాటం వల్లే అక్రమాలు చోటు చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. పోడుదారుల దరఖాస్తులు చేసుకున్నప్పటి నుంచి పట్టాలు జారీ చేసే వరకు అన్ని స్థాయిల్లో వీరిదే కీలక పాత్ర. దీంతో యథేచ్ఛగా అక్రమాలకు తెరతీశారు.పోడు భూములపై అటవీ, రెవెన్యూ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తే అక్రమాలు జరుగుతాయనే తలంపుతో పోడుదారులు, అటవీశాఖ ఉద్యోగి, పంచాయతీ కార్యదర్శి కలిపి 15 మందితో ఎఫ్ఆర్‌సీ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో గిరిజన రైతును ఛైర్మన్‌గా నియమిస్తారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో నిబంధనలకు లోబడి పారదర్శకంగా సర్వే చేసి నిజమైన పోడు రైతులకు పట్టాలు అందేలా చూడాలి. అలాంటిది పలుచోట్ల నిబంధనలు పట్టించుకోకుండా మోకాపైకి వెళ్లకుండా ప్రైవేటు వ్యక్తులకు జీపీఎస్ పరికరాన్ని ఇచ్చి వారితో సర్వే చేయించి పటాలు తీసి పంచాయతీ కార్యదర్శికి ఇచ్చారు. ఆయన ఇష్టారీతిన మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కొన్ని గ్రామాల్లో అందరు ఒక చోట కూర్చొని మొక్కుబడిగా గ్రామ సభ నిర్వహించారు. ఈ క్రమంలో చేతివాటం ప్రదర్శించి అడిగినంత ఇచ్చిన వారికి గుంట భూమి లేకున్నా ఎకరాల కొద్ది యాప్‌లో నమోదు చేసి పోడు పట్టాలు ఇప్పించారు. ఏళ్ల తరబడి పోడు సేద్యం చేస్తున్న వారికి మొండి చేయి చూపారు.

ఈ రైతు పేరు జాబితాలో లేదు..
వరి పొలానికి నీరు పెడుతున్న ఈ రైతు దారావతు వెంకన్న. నల్లబెల్లి మండలం ఆసరవెల్లి నివాసి. కొన్నేళ్లుగా ఆ గ్రామ శివారులో భద్రయ్య కుంట సమీపంలో 5.20 ఎకరాల భూమిని పోడు చేసి అందులో బోరు వేసికొని సాగు చేసుకుంటున్నారు. ఈ రైతు పేరు జాబితాలో లేకపోవడంతో పోడు భూమిలేదని పట్టా ఇవ్వలేదు.

యాప్‌లో మోకాపై లేదని నమోదు
బీటు అధికారి, పంచాయతీ కార్యదర్శి మొబైల్ యాప్ నుంచి అప్‌లోడ్ చేయగా కంప్యూటర్‌లో దారావతు వెంకన్న అనే పోడు (సీరియల్ నంబరు 24) కాలంలో మోకాపై లేదని (నాట్ ఇన్ పొజిషన్ ఆఫ్ ల్యాండ్) కనిపిస్తోంది. పోడు భూమిపై ఎఫ్ఆర్‌సీ కమిటీ సభ్యులు, బీటు అధికారి, పంచాయతీ కార్యదర్శి జీపీఎస్ సాయంతో లాంగీట్యూడ్, ల్యాటీట్యూడ్ పద్ధతిలో సర్వే చేసి దానిని మొబైల్ యాప్‌లో నమోదు చేస్తే పోడు పట్టా వచ్చేది. ఇక్కడ సర్వే బృందం అధికారులు మోకాపై లేదని నమోదు చేసినట్లు స్పష్టమవుతోంది. దీని వల్లే ఆ రైతుకు పోడు పట్టారాలేదు.

ఒక కుటుంబం.. 20 ఎకరాలకు పట్టాలు రేషన్ కార్డు నల్లబెల్లి మండలంలోని ఓ గ్రామం ఎఫ్ఆర్‌సీ కమిటీ ఛైర్మన్ కుటుంబానికి చెందినది. ఈ కార్డులో మొత్తం నలుగురు కుటుంబ సభ్యులు ఉన్నారు. పోడుదారులకు ఎంత భూమి ఉన్నా ఒక కుటుంబానికి పదెకరాలకు మించి పట్టా ఇవ్వరాదనేది ప్రభుత్వం నిబంధన. కుమారులు అవివాహితులు కావడంతో అందరు కలిసి ఉమ్మడిగా ఉంటున్నారు. నలుగురి పేర్లతో 20 ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చారు.

విచారణ జరిపిస్తాం– ప్రేమకళ, ఇన్‌ఛార్జి డీటీడీవో వరంగల్
పోడు భూముల పట్టాలపై గ్రామస్థాయిలో విచారణ జరిపిస్తాం. అక్రమాలు జరిగినట్లు తేలితే తప్పకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

# సామాన్యుడిపై ధరాఘాతం

కరీంనగర్ : మొన్నటి వరకు కూరగాయల ధరలు ఆకాశాన్నంటి సామాన్యుడిని భయపెడితే.. ఇప్పుడు పప్పులు, నిత్యావసర సరకుల వంతు వచ్చింది. ఇతర రాష్ట్రాల్లో వాతావరణ ప్రతికూల పరిస్థితులు, టోకు వ్యాపారులు, మిల్లుల యజమానులు కృత్రిమ కొరత వెరసి.. మన వరకు వచ్చే సరికి ధరలు మండుతున్నాయి. పక్షం రోజుల్లోనే వీటి ధరలు అమాంతం పెరిగాయి. పెరిగిన పప్పులు, నిత్యావసర ధరలు.. ప్రజలపై ప్రభావం తదితర అంశాలతో కథనం.

వామ్మో పప్పులు...కరీంనగర్‌లోని ప్రకాశం గంజ్‌లో నిత్యం రూ.కోట్ల వ్యాపారం జరుగుతుంటుంది. ఇక్కడ నిత్యం 150 క్వింటాళ్ల కందిపప్పు విక్రయిస్తుంటారు. పక్షం రోజుల్లో కిలోకు రూ.50 పెరిగిన నేపథ్యంలో రూ.7,50,000 అదనపు భారం పడుతోంది. కందిపప్పులో మూడు రకాల బ్రాండ్లు దిగుమతి అవుతుంటాయి. గోకుల్ రకం మధ్యప్రదేశ్ నుంచి, మహారాజా, టైగర్ రకాలు మహారాష్ట్ర నుంచి వస్తుంటాయి. మార్కెట్‌లో నిత్యం 100 క్వింటాళ్ల పెసరపప్పు అమ్ముడవుతుందని వ్యాపారులు చెప్పారు. ఇందులో ఫైగార్డు రకం మధ్యప్రదేశ్ నుంచి, సన్ బ్రాండ్ మహారాష్ట్ర నుంచి దిగుమతి అవుతుంది. రూ.20 పెరగడం తో రూ.2 లక్షలు అధికంగా వెచ్చించాల్సి వస్తోంది. మార్కెట్‌లో నిత్యం 20 క్వింటాళ్ల శెనగపప్పు విక్రయమవుతుంది. ఈ పప్పు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి వస్తోంది. దీనిపైనా అదనంగా రూ.2 లక్షల భారం పడుతోంది. మినపపప్పు ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి, గుంటూరు నుంచి దిగుమతి అవుతోంది. నువ్వులు 5 క్వింటాళ్ల వరకు విక్రయిస్తారు. ఇవి హుంజా అనే ప్రాంతం నుంచి దిగుమతి అవుతున్నాయి.

డబ్బు కొద్దీ పిండి
గోధుమ పిండి కిలో రూ.30 నుంచి 35 ఉంటే ప్రస్తుతం రూ.40 నుంచి రూ.50 మధ్యకు చేరింది. నిత్యం 100 బస్తాలు విక్రయం అవుతుండగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి అవుతోంది. మైదా కిలో రూ.40 ఉంటే రూ.50కు పెరిగింది. ఇది నిత్యం 50 బస్తాలకు పైగా అమ్ముడవుతోంది. హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రానికి దిగుమతి అవుతోంది. ఉప్మా రవ్వ కిలో రూ.35 ఉంటే ప్రస్తుతం రూ.45 వరకు విక్రయిస్తున్నారు. రవ్వ మధ్యప్రదేశ్, హైదరాబాద్ నుంచి దిగుమతి అవుతోంది. నిత్యం 50 బస్తాల వరకు విక్రయం జరుగుతుంది.

ప్యాలాలూ అంతే..బేల్‌పూరిలో ఉపయోగించే బోలు ప్యాలాలు(మరమరాలు) ధరలు అమాంతం పెరిగాయి. బస్తా రూ.700 ధర పలికిన ప్యాలాలు ఇప్పుడు రూ.850కు విక్రయిస్తున్నారు. ఇవి మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి అవుతుండగా, సిద్దిపేట కేంద్రంగా తయారు చేస్తున్న ప్యాలాలు బస్తా రూ.400 నుంచి రూ.500 వరకు పెరిగింది.

రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయాలిగతంలో చౌకధరల దుకాణాల్లో తొమ్మిది వస్తువులను రాయితీపై ఇచ్చేవారు. ప్రస్తుతం బియ్యం తప్ప మిగిలిన సరకులు ఇవ్వడంలేదు. ధరలు పెరిగిన సమయంలోనైనా ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేయాలి. నిరుపేద కుటుంబాలపై భారం పడకుండా చూడాలి.లక్ష్మి, గృహిణి, కరీంనగర్

# ఆర్థిక.. డిజిటల్ పరిజ్ఞానమూ కీలకం

జగిత్యాల : నేటి కాలంలో అక్షరాలు నేర్చుకోవడమే కాదు.. ఆర్థిక.. డిజిటల్ అక్షరాస్యతా కీలకమయింది.. డిగ్రీలు మనకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మాత్రమే కల్పిస్తాయి.. సంపాదిస్తున్న క్రమంలో భవిష్యత్తు కోసం ఆర్థిక ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఆర్థిక పరమైన అంశాల పట్ల అవగాహన తప్పనిసరిగా ఉండాలి.. దీంతోపాటు ప్రపంచం డిజిటల్‌గా మారుతున్న క్రమంలో ఈ అంశంపైనా అవగాహన అవసరం.

ఆర్థిక అవగాహన ఇలా..
ఆర్థికంగా అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణం పొదుపు, మదుపుపైనే ఆధారపడి ఉంది. బడ్జెట్ నిర్వహణ, పెట్టుబడులు, రుణ చెల్లింపులు వంటి నైపుణ్యాల ద్వారా యువత భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డుల వినియోగం, నెలసరి రుణ వాయిదాల సక్రమ చెల్లింపు (ఈఎంఐ), రుణ వ్యూహాలను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణ పెరిగి డబ్బు ఆదా కావడంతోపాటు జీవిత లక్ష్యాలను సమర్థంగా సాధించడానికి, ఆర్థిక శ్రేయస్సుకు దారి తీస్తుంది. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత కల్పించడానికి లీడ్ బ్యాంకులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు బ్యాంకు శాఖలు విద్యార్థులకు, స్వశక్తి, మహిళా సంఘాల సభ్యులకు, రైతులకు, వృద్ధులకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల యాజమాన్యాలకు అవగాహన కల్పిస్తున్నాయి.

సాంకేతికతతో జాగ్రత్త
ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో చదువులు, ఉద్యోగ తీరులు మారిపోయాయి.. సామాన్య జనం జీవితంలోనూ సాంకేతికత ప్రధాన పాత్ర పోషిస్తోంది.. స్మార్ట్‌ఫోన్లతో అరచేతిలో ప్రపంచం ఉంది.. కంప్యూటర్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవడం.. కార్యాలయాలకు వెళ్లి బిల్లులు కట్టడం.. బ్యాంకులకు వెళ్లి లావాదేవీలు నిర్వహించే స్థాయి నుంచి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే ఇంట్లో కూర్చునే ఈ పనులన్నీ చేసుకునే వెసులుబాటు వచ్చింది.. జేబులో డబ్బులు లేకపోయినా.. బ్యాంకు ఖాతాలో ఉంటే చాలు స్మార్ట్‌ఫోన్ తీసుకుని వెళ్లి స్కాన్ చేసి ఏదైనా కొనుగోలు చేసుకోవచ్చు. కరోనా విపత్కర పరిస్థితుల కంటే ముందు 12 శాతం ఉన్న డిజిటల్ లావాదేవీలు ప్రస్తుతం 43 శాతానికి పెరిగినట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుకుని ఆర్థికంగా నష్టపోతున్నవారూ ఉన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో వీటి వినియోగం ఎంత ముఖ్యమో... వీటి పట్ల సరైన అవగాహన కలిగి ఉండటం కూడా అంతే ప్రధానం.

ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సినవి ఇవీ...
తెలియని వ్యక్తుల నుంచి చరవాణులకు వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దు. ప్రభుత్వం ఆమోదించిన యాప్‌ల ద్వారా మాత్రమే లావాదేవీలు నిర్వహించాలి.ఎట్టి పరిస్థితుల్లోనూ మీ చరవాణికి వచ్చే ఓటీపీలు వేరేవారికి చెప్పొద్దు.
క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డబ్బులు వస్తాయని చెబితే నమ్మి మోసపోవద్దు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం చెల్లింపులకే కాని.. డబ్బులు రావడానికి కాదని గుర్తించాలి.
అపరిచితులకు ఎట్టి పరిస్థితుల్లో మన వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు తెలియనీయొద్దు.

ఆర్థిక సత్ప్రవర్తనే శ్రీరామ రక్ష : ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఈ పరిజ్ఞానం తోడ్పడుతుంది. దీని కోసం లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 98 అవగాహన సదస్సులు నిర్వహించాము. పి.వెంకటరెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, జగిత్యాల

## మెరుగైన విద్యుత్తు సరఫరా దిశగా అడుగులు

కరీంనగర్ : మెరుగైన విద్యుత్తు సేవలను అందించే దిశగా జిల్లాలో అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే పెరుగుతున్న డిమాండ్‌కు తగినట్లు సరఫరాపై దృష్టి సారించిన యంత్రాంగం లోవోల్టేజీ సమస్యను రూపుమాపేందుకు చర్యలు తీసుకుంటుంది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని కొత్త ఉపకేంద్రాల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాలు 93 ఉండగా, ఇటీవల పెరిగిన వ్యవసాయ కనెక్షన్ల దృష్ట్యా వీటి సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేస్తున్నారు. గతేడాది ప్రభుత్వం ఆదేశాలతో ఊరువాడల్లో విద్యుత్తు వ్యవస్థను మరింత పకడ్బందీగా మార్చేందుకు పవర్‌వీక్ కార్యక్రమం ద్వారా విడతల వారీగా ప్రత్యేక సర్వేను జిల్లాలో నిర్వహించారు. గ్రామాల వారీగా అవసరమైన చోట కొత్త 11కేవీ, 33 కేవీ, ఎల్‌టీ తీగల ఏర్పాటుతోపాటు నియంత్రికలను అమర్చారు. వంగిన స్తంభాలను 337 చోట్ల సరిచేస్తూనే 1,094 చోట్ల వేలాడుతున్న తీగలను సక్రమంగా మార్చారు. విద్యుత్తు చౌర్యాన్ని అరికట్టేందుకు ఊళ్లల్లో మూడో తీగను 1,031 కి.మీ దూరం బిగించారు.

ఏడు చోట్ల స్థల పరిశీలన..

ప్రస్తుతమున్న 93 విద్యుత్తు ఉపకేంద్రాల(33/11కేవీ)కు తోడుగా మరో ఏడు చోట్ల ఉపకేంద్రాల ఏర్పాటుకు సర్కారు ఆమోదం తెలిపింది. దీంతో మంజూరైన వీటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు ఆయా ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. ఎక్కువగా లోవోల్టేజీ ఇబ్బంది ఉన్న ఊళ్లకు చేరువగా వీటిని ఏర్పాటు చేయాలని భావించారు. ఒక్కో దానికి రూ.1.41 కోట్ల నిర్మాణ వ్యయంతో ఏడింటికి రూ 9.87 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే కొత్తపల్లి మండలం ఖాజీపూర్‌లో ఒకటి ఉండగా మరొకటి నిర్మించేలా స్థలం చూసిపెట్టారు. గంగాధర మండలం ఒద్యారం, ఉప్పర్ మల్యాలలోనూ గుర్తించారు. హుజూరాబాద్‌లో సిద్ధంగా ఉంది. జమ్మికుంట మండలం కోరపల్లి, వీణవంక మండలం బొంతుపల్లిలో అన్వేషిస్తున్నారు. సైదాపూర్ మండలం అమ్మనగుర్తిలో అనుకూలంగా ఉండనున్న భూమి వివాదంలో ఉంది. ఈ ఏడు చోట్ల తొందరగా భూసేకరణ జరిపి టెండర్లు పిలిచి ఆరు నెలల వ్యవధిలో ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

రూ.48.69 కోట్లతో మరిన్ని పనులు

సమీప భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్తు సేవలకు అవసరమైన ఇతర పనుల విషయంలోనూ అంచనాలను రూపొందించి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో మొదటి ప్రాధాన్యంగా మరో పది ఉప కేంద్రాలను నిర్మించాలని భావించారు. ప్రస్తుతం స్థల సేకరణలో ఉన్న ఏడింటికితోడు పది చోట్ల ఎక్కడెక్కడ అవసరాలనేది గుర్తించి మంజూరు చేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.14.15 కోట్ల అంచనా వ్యయమవసరమని లెక్కలేశారు. 33కేవీ, 11కేవీ విద్యుత్తు తీగలను దాదాపు 200 కి.మీ పెంచడానికి రూ.15 కోట్లు, కొత్త నియంత్రికలకు రూ.2 కోట్లు, నూతన ఎల్‌టీ లైన్, ఇతర విద్యుత్తు ఉపకరణాలకు రూ.19.54 కోట్ల నిధులు అవసరమని ఉన్నతాధికారులకు నివేదించారు. పంపిన ప్రతిపాదనలకు మోక్షం లభిస్తే క్షేత్రస్థాయిలో కరెంట్ కష్టాలు తీరనున్నాయి. ఈ వేసవికి ముందే విద్యుత్తు వ్యవస్థ మరింత పటిష్ఠమయ్యేలా నిధులు జిల్లాను చేరేది మేలనే భావన ప్రజల నుంచి బలంగా వినిపిస్తోంది. ఈ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపించాలి.

## రూపు కోల్పోయిన మినీ ట్యాంక్‌బండ్

చొప్పదండి : మండలంలోని రెవెల్లి గ్రామంలో నిర్మించిన పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్ రూపం కోల్పోయింది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అధికారులు దానిపై పర్యవేక్షణ చేయకపోవడంతో పగుళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. మొదటి విడతలో 2017లో ఈ నిర్మాణానికిగాను రూ.6.55 కోట్లు కేటాయించారు. కట్టను పూర్తి స్థాయిలో బలంగా తయారు చేయడంతోపాటు పూడిక మట్టిని తొలగించారు. కట్టపై రెయిలింగ్ నిర్మాణంతోపాటు పాదచారులు నడిచేందుకు ట్రాక్ ఏర్పాటు చేశారు. అలుగు, తూము మరమ్మతు చేపట్టారు.

పగుళ్లు తేలిన కట్ట వంతెన

గతంలో ఉన్న కట్టను పూర్తి స్థాయిలో మరమ్మతు చేశారు. కానీ ప్రస్తుతం కొంతభాగంలో పగుళ్లు తేలి వర్షాకాలంలో నీళ్లు లీకవుతున్నాయి. దేశాయిపేటకు వెళ్లే దారిలో కట్ట కొంతభాగం కోతకు గురైప్రమాదకరంగా మారింది. లీకేజీ కావడంతో పక్కనే ఉన్న పొలాల్లో



తుంగ మొలిచి వ్యవసాయానికి పనిరాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ట్రాక్‌పై పిచ్చి మొక్కలు మొలవడంతోపాటు నడవడానికి వీలులేకుండా మొత్తం పగుళ్లు తేలాయి. ట్రాక్ నిరుపయోగంగా మారింది. మత్తడి దూకే ప్రాంతంలో పిచ్చి మొక్కలు మొలవడంతో రాత్రిపూట మందుబాబులకు అడ్డాగా మారుతోంది.

ఆహ్లాదంపై నిర్లక్ష్యం..మినీ ట్యాంక్‌బండ్‌గా చేసే చెరువుకు విధిగా పర్యాటకాన్ని ప్రోత్సహించేలా బోటింగ్ సదుపాయం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలి. పనులు ప్రారంభించి ఐదేళ్లు అవుతున్నా.. ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయలేదు. చెరువు కట్ట పక్కనే ఉద్యానవనంతోపాటు రోడ్డుకు ఇరువైపులా లైటింగ్ సదుపాయం, చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా నిధుల లేమితో నిర్మాణ పనులను పక్కన పడేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మినీ ట్యాంక్‌బండ్ పనులు పూర్తిదశకు చేరుకున్నా ఇక్కడ జరగకపోవడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

# ఆగని అక్రమ నిర్మాణాలు



పరకాల : పరకాల మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అనుమతి పొందిన సమయంలో చూపిన ప్లాన్ విధంగా కాకుండా ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు. దీనికితోడు రోడ్లు, మురుగు కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు జరుగుతుండగా పాలకవర్గం, అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. పరకాలతోపాటు విలీన సీతారాంపురం, రాజిపేట గ్రామాల్లో కలిపి మొత్తం 9,124 ఇళ్లు అధికారికంగా ఉన్నాయి. స్థానికంగా భూములకు మంచి డిమాండ్ ఉండటంతో గత ఐదారేళ్ల నుంచి క్రయ విక్రయాలు, నూతన ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈక్రమంలో గత మూడేళ్లలో అధికారికంగా 295 నూతన ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు.నిబంధనలను ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాల్సిన పాలకవర్గం, అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దామెర చెరువుకు సంబంధించిన బండ్ల బాట ఉంది. ఇప్పటికే అనేక చోట్ల ఆక్రమణలకు గురికాగా ఇటీవల మరొకరు ఇంటిని నిర్మిస్తున్నారు. దీనిపై పలువురు రెవెన్యూ, పురపాలక సంఘం అధికారులకు ఫిర్యాదు చేసినా పనిని ఆపినట్లే ఆపి మళ్లీ చేస్తున్నారు. కూరగాయల మార్కెట్ రోడ్డులో ఓ చోట రెండంతస్తుల రెండిళ్లను కడుతుండగా ఒకరు నిబంధనల ప్రకారం రోడ్డుకు ముందు నాలుగు నుంచి ఐదు ఫీట్లను వదిలారు. మరొకరు మాత్రం ముందు స్థలాన్ని వదలకుండా రోడ్డుపైనే నిర్మిస్తున్నారు. అధికారులు వచ్చి చూసి వెళున్నారే తప్ప నిర్మాణ పనులు నిలిపివేయనందున చక చకా జరుగుతున్నాయి. శ్రీనివాస కాలనీలో దామెరు చెరువు కట్ట సమీపంలో 21 ఫీట్ల మట్టి రోడ్డు ఉంది. అక్కడ ఇద్దరు ముగ్గురు ఇళ్లు కడుతుండగా ఒకరు పిల్లర్లను, మెట్లును రెండు మూడు ఫీట్ల వరకు రోడ్డుపైనే నిర్మిస్తున్నారు. దీనిపై స్థానికులు పురపాలక సంఘం అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవు. రజక వీధిలో ఒకరిద్దరు ఇళ్లు కడుతుండగా ఏకంగా మురుగు కాల్వపైనే గోడలు నిర్మిస్తున్నారు. అసలే ఇది ఇరుకు రోడ్డు కాగా కాల్వలను సైతం ఆక్రమిస్తుండగా అడ్డు చెప్పేవారు లేకుండా పోయారు దామెర చెరువు పంట కాల్వపై ఎలాంటి అనుమతి లేకుండా ఇంటిని నిర్మించగా ముందుగా అధికారులు కూల్చివేశారు. అయినా అదే చోట అక్రమంగా ఇంటిని కట్టగా అందుకు అధికారులతోపాటు పలువురు సహకరించినట్లు ఆరోపణలున్నాయి.

అక్రమ నిర్మాణాలపై దృష్టి- టి.శేషు, పరకాల పురపాలక సంఘం కమిషనర్

పరకాలతోపాటు విలీన గ్రామాల్లో పలుచోట్ల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు దృష్టికి వచ్చింది. ఆయా ఇళ్లను పరిశీలించి నిబంధనలను పాటించని నిర్మాణాలను కూల్చివేస్తాం. అన్ని రకాల అనుమతులు తీసుకున్నాకే ఇళ్లను కట్టుకోవాలి.

# అన్నదాతకు మరింత సహకారం




కరీంనగర్ : దేశంలో అయిదేళ్లలో రెండు లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో కొత్తగా మరిన్ని ఏర్పాటయ్యే అవకాశముంది. రైతులకు 25 రకాల సేవలు వీటి ద్వారా అందించాలన్నది ప్రభుత్వ నిర్ణయం. ఇందుకు గ్రామాల వారీగా జనాభా, సాగు విస్తీర్ణం, రైతుల సంఖ్య, తదతర వివరాలను సేకరించే అంశంపై అధికారులు దృష్టి సారించారు.

గతంలో ఏం జరిగిందంటే...2006 వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 208 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండేవి. ఉదాహరణకు హుస్నాబాద్ మండలంలో రామవరం, పందిళ్ల, మల్లంపల్లి ఉండేవి. ఇవి నష్టాలలో ఉన్నాయని, ఈ మూడింటిని హుస్నాబాద్‌లాంటి వాటిలో విలీనం చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 73 సహకార సంఘాలను 135 సంఘాలలో విలీనం చేశారు. దానివల్ల అవి దూరమై రైతులకు కొంత సమస్య ఏర్పడింది. తాజాగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పాతవి పురుడు పోసుకోవడమే కాకుండా మరిన్ని గ్రామ స్థాయిలో ఏర్పడే అవకాశముంది.

విస్తరిస్తున్న సేవలుకరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు సంఘాలు సహకార సేవలందించడంలో ముందుంటున్నాయి. వీటిని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా పలు రకాల రుణ సౌకర్యం కల్పిస్తోంది. రైతుల పంట రుణాలతోపాటు ఇతర రుణాలు కూడా ఇస్తున్నారు. కొన్ని పెట్రోలు బంక్‌లు, రైస్ మిల్లులవంటి వాటితోపాటు ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విక్రయాలు వంటివి చేపడుతూ బలోపేతం చేసుకుంటున్నాయి. ముఖ్యంగా రైతులకు ఇచ్చే పంట రుణాలు దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడంలో ముందుంటున్నాయి.

సంఘాల కంప్యూటరీకరణ

ఉమ్మడి జిల్లా పరిధిలోని 99 శాతం సహకార సంఘాల్లో కంప్యూటీకరణ జరిగింది. 80 శాతం ఇతర వ్యాపారాలు చేపట్టాయి. 98 శాతం సొంత భవనాలు కల్గి ఉన్నాయి. జాతీయ స్థాయిలో చొప్పదండికి ప్రత్యేక గుర్తింపు లభించింది.

ఆదేశాలు రాగానే..-శ్రీమాల, జిల్లా సహకార అధికారి

కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మాకు ఎలాంటి ఆదేశాలు అందలేదు. విధివిధానాలకు అనుగుణంగా కొత్త సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతాం.

మండలానికి రెండు అవసరం-కె.రవీందర్‌రావు, ఛైర్మన్, టెస్కాబ్

సంఘాల విస్తరణ అవసరమే. అవసరాలకు అనుగుణంగా మండలానికి రెండు, మూడు అవసరం. లాభాల దిశలో లేని వాటిని బలోపేతం చేయాలి. గ్రామానికి ఒకటి అనే విషయంలో ఆర్థిక స్థితిగతులు, ఇతర అంశాలు పరిశీలించాలి. అది సరైంది కాదు.

# గ్రామ సచివాలయాలకు నూతన భవనాలు




కరీంనగర్ : పల్లె ప్రజల సౌకర్యాలు మెరుగుగా ఉండాలంటే పర్యవేక్షణ ఎంతో అవసరం. అలాంటి పర్యవేక్షణ పల్లెల్లో గ్రామ సచివాలయం ద్వారా నిర్వహిస్తుంటారు. సమావేశాలు, తీర్మానాలు అన్ని అక్కడి నుంచే చేస్తారు. అలాంటి సచివాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో, మరికొన్ని పాఠశాల భవనాల్లో నడుస్తున్నాయి. కొన్ని చోట్ల భవనాలున్నా శిథిలావస్థకు చేరి కనీస సౌకర్యాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ సర్కారు జిల్లాకు 96 నూతన భవనాల నిర్మాణానికి రూ.19.20 కోట్లు మంజూరు చేసింది. ఇకపై ఇబ్బందులు తీరనున్నాయి.

జిల్లాలో 313 గ్రామ పంచాయతీలుజిల్లాలో 313 గ్రామపంచాయతీలు ఉండగా అందులో 96 పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. అందులో అత్యధికంగా 16 భవనాలు గంగాధర మండల కేంద్రానికి కేటాయించారు. అత్యల్పంగా హుజూరాబాద్, ఇల్లందకుంటలకు మూడేసి చొప్పున కేటాయించారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున వెచ్చిస్తూ నిర్మాణం చేయనున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం- కనకరత్నం, ఎస్ఈ, పంచాయతీరాజ్

పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు కావడంతో త్వరలోనే పనులు చేపడతాం. ప్రస్తుతం సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయి. అవి పూర్తి చేసిన అనంతరం ప్రారంభిస్తాం. పంచాయతీల తీర్మానం మేరకు పనులు చేస్తాం. నిధులు పంచాయతీ ఖాతాల్లో జమ అవుతాయి.

## లీకేజీలు నిత్యం.. తాగునీటికి కష్టం

కరీంనగర్ : వేసవి కాలంలో పురపాలక సంఘాల్లో తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారు. సరఫరాలో ఇబ్బందులు, భూగర్భ జలాలు అడుగంటడంతో సమస్యలు అధికంగా ఉంటాయి. మిషన్ భగీరథ పథకం ప్రారంభమైన తర్వాత బల్దియాల్లో తాగునీటి సమస్య కొంతమేర తగ్గుముఖం పట్టినా కొత్త సమస్యలు తెరపైకి వచ్చాయి. డబ్బా గ్రిడ్ నుంచి జిల్లా మొత్తానికి తాగునీరు సరఫరా అవుతుంది. ఈ నేపథ్యంలో తరచూ ఎక్కడో ఒకచోట పైపులైన్ లీకై రెండుమూడు రోజులు నీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయి. పట్టణాల్లోని కాలనీల్లో అసంపూర్తి పనులతో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇంకా పూర్తికాలేదు. జిల్లాలోని పురపాలికల్లో తాగునీటి సరఫరా, సమస్యలను బృందం పరిశీలించింది. ఆ వివరాలు..

చివరి దశకు పనులు



పట్టణంలో మిషన్ భగీరథ పథకం పనులు చివరి దశకు చేరడంతో ఇంటింటికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణంలో మొత్తం 33 వార్డులుండగా, 22,115 కుటుంబాలు, 80,000 మంది జనాభా ఉంది. భగీరథ పథకం ద్వారా మొత్తం 196.02 కి.మీ పొడవునా పైపులైన్ పనులు పూర్తి చేశారు. 7 నీటి ట్యాంకులను, పంపు నిర్మాణం పూర్తిచేసి 16,500 కుళాయిలను బిగించారు. నిత్యం 13.80 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో పైపులైన్ పనులు చేపడుతున్నారు. తరచూ లీకేజీలతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని వార్డుల్లో గతంలో 50 బోరు బావులు తవ్వించి మినీట్యాంకులను నిర్మించారు. ఇందులో 44 బోరుబావుల ద్వారా నిత్యం నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ అయాజ్ మాట్లాడుతూ పట్టణంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలోనూ ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

అరకొర సరఫరాపట్టణంలో 12 వార్డులకు సుమారు 20 వేల జనాభా ఉంది. తాగునీటి కోసం రూ.10 కోట్లతో గతంలో ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్ మిషన్ భగీరథ రాకతో నిరుపయోగంగా మారగా ఇంటింటికి నీటి సరఫరా అందని ద్రాక్షగానే మారింది. భగీరథ పనులు పూర్తయినా ఇంకా చాలా కాలనీల్లో లోప్రెషర్, తరచూ పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. పట్టణంలో మొత్తం 5 నీటి ట్యాంకులు ఉండగా 2 మున్సిపల్ పరిధివి కాగా మూడు మిషన్ భగీరథవి. మిషన్ భగీరథ ట్యాంకులో ఒక ట్యాంకు నిర్మాణం అసంపూర్తిగా ఉండగా రెండు ట్యాంకుల నిర్మాణం పూర్తయింది. పట్టణంలో మొత్తం 6 మంచి నీటి బావులు ఉన్నాయి. వీటిలో ఎర్రకుంట బావి నుంచి 3వ వార్డుకు, పెద్ద చెరువు కింద ఉన్న బావి నుంచి 7, 8, 12వ వార్డుల కాలనీలకు మోటార్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తున్నారు. పట్టణంలో మొత్తం 1.68 ఎంఎల్‌డీల నీటి డిమాండ్ ఉండగా రోజు విడిచి రోజు సరఫరాలో మిషన్ భగీరథ ద్వారా 0.79 ఎంఎల్‌డీలు, మున్సిపల్ బావుల నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులు, డైరెక్టు పంపింగ్ ద్వారా 0.90 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నట్లు కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్ పేర్కొన్నారు.

సమస్యలు తీర్చరా!

ధర్మపురి పట్టణంలో వేసవికి ముందే తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఓ వైపు రహదారుల నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో మిషన్ భగీరథ పైపులైన్లు తక్కువ లోతులోనే వేయడంతో పైపులు పగిలి నీటి సమస్యలు నెలకొంటున్నాయి. మొత్తం 15 వార్డులుండగా 6 వేల నీటి కనెక్షన్లు, 7 తాగునీటి ట్యాంకులు ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామం నుంచి నీటి సరఫరా కావాల్సి ఉండగా ప్రధానగ్రిడ్ పైపులైన్లు లీకేజీలు ఉండటంతో పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా కమలాపూర్ తాగునీటి పథకానికి రూ.10 కోట్లు వెచ్చించి అనుసంధానం చేసి సరఫరా చేస్తున్నారు. నక్కలపేట, కమలాపూర్ ఇందిరమ్మ కాలనీ, తెనుగువాడ, కమలాపూర్ కూడలి, వివేకానంద కూడలి ప్రాంతాల్లో భగీరథ పైపులైన్లు ఏర్పాటు చేయలేదు. ఈ విషయమై కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ధర్మపురిలో తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నామని, మిషన్ భగీరథ పథకంతో పాటు, కమలాపూర్ పథకాన్ని పూర్తిగా వినియోగిస్తున్నామన్నారు.

కొత్తగా 5 వేల దరఖాస్తులు..

పట్టణంలో 48 వార్డులుండగా 1.25 లక్షల జనాభాకుగాను 20 వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. డబ్బా నుంచి వస్తున్న భగీరథ నీటితో సరఫరాకు 5 ఏళ్లుగా అంతరాయం లేదు. మిషన్ భగీరథ కింద క్యాంపులో అదనపు రిజర్వాయర్, నీళ్ల ట్యాంకుల నిర్మాణాలతో కొత్తగా మరో 15 వేల నల్లా కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఈ పనులు ఇంకా నిర్మాణ దశలో ఉన్నాయి. భగీరథ ద్వారా పట్టణంలో 60 కి.మీ విస్తీర్ణంలో పైపులైను నిర్మించారు. కాలనీల్లో 80 శాతం మేరకు ఇళ్లలో నల్లాలు బిగించి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు తాగునీటి సరఫరా అందించలేకపోతున్నారు. డిస్ట్రిబ్యూటరీ పైపులైన్లు అనుసంధానించకపోవడమే కారణంగా చెబుతున్నారు. కొత్త నల్లా కనెక్షన్ల కోసం ఇప్పటి వరకు 5 వేల పైనే దరఖాస్తులు వచ్చాయి. భూగర్భజలాలు సమృద్ధిగా ఉండటంతో చాలామంది బోరుబావులపైనే అధికంగా ఆధారపడుతున్నారు. తాగునీటి సరఫరాలో లోపాలపై ఇంజినీరింగ్ విభాగం ఏఈ చరణ్‌తేజ వివరణ కోరగా మరో 3 నెలల్లో భగీరథ పనులు పూర్తి దశకు చేరతాయని కొత్త కనెక్షన్ల ద్వారా సరఫరా మెరుగుపడుతుందని చెప్పారు.

90 శాతం పూర్తి...

బల్దియా పరిధిలో మిషన్ భగీరథ పనులను ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ప్రజలకు మాత్రం నీటి కష్టాలు తప్పడం లేదు. నిత్యం ఏదో ఒక వీధిలో పైపులైన్ లీకేజీలతో నీరంతా వృథాగా పోతుంది. 26 వార్డులలో 54,335 జనాభా ఉండగా 112 కి.మీ మేర పైపులైన్ వేసి 12 వేల వరకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. మండల పరిషత్ ఆవరణతో పాటు వ్యవసాయ మార్కెట్లో, ఖాదీ ఆవరణలో నిర్మిస్తున్న ట్యాంకులు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని వీధుల్లో ఇంకా పైపులైన్లు వేయక కొన్ని వార్డులలో ఇంటింటికీ నల్లాలు బిగించకపోవడంతో లక్ష్యం చేరడం లేదు. ఈ విషయమై ఇన్‌ఛార్జి కమిషనర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు 90 శాతం పనులు పూర్తయ్యాయని త్వరలోనే పూర్తిస్థాయిలో ఇంటింటికీ తాగునీటిని అందిస్తామన్నారు. కొత్తగా పైపులైన్లు వేయడంతో నీటిని వదిలినప్పుడు ఒత్తిడితో పాటు సమస్యలతో లీకేజీ అవుతుండగా సిబ్బందితో వెంటనే మరమ్మతులు చేపడుతున్నామన్నారు.



# జీ20 గ్రాండ్ సక్సెస్: అమెరికా

వాషింగ్టన్: భారత్ అధ్యక్షతన జీ20 శిఖరాగ్ర సదస్సు అట్టహాసంగా జరిగింది. ఇది సంపూర్ణ విజయం సాధించిందంటూ అమెరికా స్పందించింది. ఈ సదస్సు విజయవంతమైందా..? అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు యూఎస్ విదేశాంగ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ ఈ మేరకు బదులిచ్చారు. 'ఈ సదస్సు సంపూర్ణ విజయం సాధించిందని మేం నమ్ముతున్నాం. జీ20 ఒక పెద్ద కూటమి. దానిలో రష్యా, చైనా కూడా సభ్యదేశాలే' అని అన్నారు.

అలాగే సదస్సులో భాగంగా రష్యా పేరు ప్రస్తావించకుండా దిల్లీ డిక్లరేషన్ జారీ చేయడంపై స్పందిస్తూ.. 'ఈ కూటమిలో విభిన్న అభిప్రాయాలు కలిగిన సభ్య దేశాలున్నాయి. అదే సమయంలో ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని గౌరవించాలని పిలుపునిస్తూ ఈ కూటమి ఒక ప్రకటన జారీ చేయగలిగింది. ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతోన్న దాడి నేపథ్యంలో ఇది చాలా ముఖ్యమైన ప్రకటన అని మేం భావిస్తున్నాం' అని మిల్లర్ అన్నారు.

**చైనా బెల్ట్‌కు చెక్!** జీ20 కూటమి అధ్యక్ష హోదాలో భారత్.. పలు అంశాలపై భాగస్వామ్య దేశాల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయాన్ని సాధించగలిగింది. సంయుక్త ప్రకటనలో రష్యా పేరును ప్రస్తావించకుండానే ఉక్రెయిన్ అంశంపై జీ20 కూటమి పలు సూచనలు చేసింది. అణు బెదిరింపులు తగవని, ఇది యుద్ధాల శకం కాదని స్పష్టంచేసింది. విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కోరింది. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడంలో జీ20 దేశాలు చేతులు కలుపుతున్నాయనే సంకేతాన్ని దిల్లీ డిక్లరేషన్ ఇస్తోందంటూ చైనా స్పందించింది. ఆర్థిక పునరుద్ధరణ విషయంలో ప్రపంచానికి ఇది సానుకూల సంకేతాన్ని పంపిస్తోందని పేర్కొంది.



# జైలుకు తరలిస్తారని ప్రభుత్వానికి ముందే ఎలా తెలుసు?

దిల్లీ: మాజీ ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబుకు ప్రాణ హాని పొంచి ఉందని వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. గతంలో మాజీ మంత్రి పరిటాల రవి హత్య కేసులో సాక్ష్యాలు రూపుమాపేందుకు జైలులోనే హత్య చేసిన ఘటనలున్నాయని పేర్కొన్నారు. తనను కూడా గుంటూరు జైలులో హత్య చేయాలని పథక రచన చేశారని, వేంకటేశ్వర స్వామి దయ, సుప్రీంకోర్టు తీర్పుతో బతికి బయటపడ్డానని తెలిపారు. మరో మూడు నాలుగు రోజులపాటు జైలులోనే ఉంటే తనను కచ్చితంగా హత్య చేసి ఉండేవారన్నారు. దిల్లీలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబుపై మోపిన కేసులో పస లేదని.. కేవలం నస, కసి మాత్రమే ఉన్నాయని ఎంపీ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును రాజమహేంద్రవరం జైలుకు తరలించాలని ఏసీబీ కోర్టు ఆదేశాలు ఇవ్వక ముందే ఆ నగరంలో 144 సెక్షన్ విధించడం, రహదారిని క్లియర్ చేయడం వంటి ఘటనలు పరిశీలిస్తే తీర్పు ఏమిటో ప్రభుత్వానికి ముందే తెలుసనే భావన నెలకొందన్నారు. నైపుణ్య శిక్షణ కోసం గత ప్రభుత్వం కేవలం రూ.370 కోట్లు మాత్రమే విడుదల చేస్తే అందులో రూ.550 కోట్ల అక్రమాలు జరిగాయని పేర్కొనడం అర్థరహితమన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి సీమెన్స్ సంస్థతో గత ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకుందని, శిక్షణకు అయ్యే ఖర్చులో కేవలం 10 శాతం నిధులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 2.63 లక్షల మంది విద్యార్థులు నైపుణ్య శిక్షణ పొందారని, వారిలో 80 శాతం మంది విద్యార్థులు ఆ శిక్షణ ద్వారా వివిధ స్థాయుల్లో ఉద్యోగాలను సంపాదించారన్నారు. సీమెన్స్ సంస్థతో గత ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకునే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉన్న అజేయ కల్లం ఆర్థిక శాఖ వ్యవహారాలనూ పర్యవేక్షించారన్నారు. నైపుణ్య శిక్షణ కార్యకలాపాలను కార్యదర్శి హోదాలో ప్రేమచంద్రారెడ్డి నిర్వహించారని గుర్తు చేశారు. అందులో ఒకవేళ అవినీతి చోటుచేసుకుంటే ముందు అజేయ కల్లం, ప్రేమచంద్రారెడ్డిలను అరెస్టు చేసిన తర్వాతే మిగతా వారిని అరెస్టు చేయాలన్నారు.

సిట్ అధికారిగా వ్యవహరిస్తున్న రఘురామిరెడ్డి జిహాదీ బ్యాచ్‌లా వ్యవహరిస్తున్నారని ఎంపీ ధ్వజమెత్తారు. చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తుండడంతో బాధతో అనేక మంది అర్ధాంతరంగా తనువు చాలించారని ఆవేదన వ్యక్తం చేశారు. అవన్నీ జగన్ ప్రభుత్వం చేసిన హత్యలేన్నారు.



# రూల్ ఆఫ్ లా అందరికీ సమానం..

# మేయర్ కావటి మనోహర్ కావాలనే రెచ్చగొట్టారు

గుంటూరు జిల్లా: చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిన్న జరిగిన బంద్‌లో జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారని, బాధ్యతగల ప్రజా ప్రతినిధి గుంటూరు మేయర్ కావటి మనోహర్ కావాలనే రెచ్చగొట్టారని జనసేన పార్టీ నేత నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ మేయర్ ప్రవర్తన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, రూల్ ఆఫ్ లా అందరికీ సమానమని అన్నారు. రాజకీయ లబ్ది కోసం కొంతమంది అలా ప్రవర్తిస్తున్నారని, జనసేన ఎప్పుడు కూడా హింసలో పాల్గొనదని చెప్పారు. మేయర్ వాఖ్యలు వెనక్కి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించానన్నారు. అయినా పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదన్నారు. మరోసారి వ్యాఖ్యలు చేసి రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. జనసేన కార్యకర్తలను అక్రమంగా పోలీసులు నిర్బంధించారని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సూమోటోగా కేసులు పెట్టామని సుప్రీం కోర్టు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, మేయర్ అన్న మాటలు ఆయన కుటుంబ సభ్యులైన హర్షిస్తారా? అని ప్రశ్నించారు. ఇంతమంది పోలీసులు ఎందుకు ఆయనకు భద్రత కల్పిస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. ధైర్యం లేక కాదని సహనం కోల్పోకూడదని ఆలోచిస్తున్నామన్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ వెంటనే కేసు నమోదు చేయాలని, లేకపోతే కంటెంప్ట్ ఆఫ్ కోర్టు అవుతుందన్నారు. ఇరు పక్షాలపై కేసులు పెడతామని చెప్పడం దురదృష్టకరం. శాంతిభద్రతల సమస్య సృష్టించిందెవరు?.. తేల్చుకుందాం అంటారు.. ఏం తేల్చుకుంటారో చెప్పాలన్నారు. కుట్ర, కుళ్ళు రాజకీయాలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఏపీలో ఇసుక రీచ్‌ల తవ్వకాలపై కూడా ఈడీ దర్యాప్తును కోరతామని,153ఏ, 153బి కింద కేసు నమోదు చేయాలని ఎస్పీకి చెబుతామని, లేకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# చంద్రబాబు అరెస్ట్‌పై స్పందించిన అఖిలేష్ యాదవ్



న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌పై ఇండియా కూటమి నేతలు స్పందిస్తున్నారు. ముందుగా పశ్చిమబెంగాళ్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అనూహ్య రీతిలో టీడీపీ చీఫ్ అరెస్ట్‌పై స్పందించారు. చంద్రబాబును అరెస్ట్ చేసిన తీరు సరికాదని అన్నారు. ఇప్పుడు తాజాగా యూపీ మాజీ సీఎం, ఎస్పీ (సమాజ్ వాది పార్టీ) అధినేత అఖిలేష్ యాదవ్... చంద్రబాబు అరెస్ట్‌పై ట్వీట్ చేశారు. ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం ఇప్పుడు కేంద్రం నుంచి రాష్ట్రాల వరకు ట్రెండ్‌గా మారిందన్నారు. అధికారంలోకి రాని వారిని జైల్లో పెట్టడం నిరంకుశ పాలకుల విధానమని.. ప్రజాస్వామ్యంలో దీనికి తావు లేదని తెలిపారు. రాజకీయాల్లో ఇలాంటి విషయాలకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని బీజేపీ, వారి అవకాశవాద స్నేహితులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. స్వార్థపూరిత బీజేపీ ఎవరికీ రాజకీయ మిత్రుడు కాదంటూ చంద్రబాబును టాగ్ చేస్తూ అఖిలేష్ యాదవ్ ట్వీట్ చేశారు. చంద్రబాబు అరెస్ట్‌పై స్పందించిన ఇండియా కూటమిలోని రెండవ నేత అఖిలేష్ యాదవ్.

**యనమలకు ఫోన్ చేసిన అఖిలేష్ :** మరోవైపు టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడుకు కూడా అఖిలేస్ ఫోన్ చేశారు. చంద్రబాబు అరెస్ట్, అనంతర పరిణామాలను అడిగి తెలుసుకున్నారు.

చంద్రబాబు అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. అరెస్టు చట్టవిరుద్ధం అని పేర్కొన్నారు. చంద్రబాబు కుటుంబ సభ్యులతో మాట్లాడుతానని యనమలకు అఖిలేష్ చెప్పారు.

# జైలును కూడా కంట్రోల్‌లోకి తీసుకోవాలని జగన్ కుట్ర: చినరాజప్ప

రాజమహేంద్రవరం: తెదేపా అధినేత చంద్రబాబు ప్రాణాలకు జైలులో రక్షణ లేదని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. జైలు సూపరింటెండెంట్‌ను బదిలీ చేస్తున్నామంటూ వైకాపా లీకులు ఇస్తోందని ఆయన మండిపడ్డారు. జైలును కూడా తమ కంట్రోల్‌లోకి తీసుకోవాలని జగన్ కుట్ర పన్నారని ఆరోపించారు.

రాజమహేంద్రవరంలో మీడియాతో చినరాజప్ప మాట్లాడారు. జైలు లోపలి అంశాలు ఎప్పటికప్పుడు సాక్షి, అనుబంధ మీడియాకు అందిస్తున్నారని చినరాజప్ప ఆరోపించారు. ఈ పరిణామాల పట్ల రాజ్యాంగ పెద్దలు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైకాపా హయాంలో పలుమార్లు చంద్రబాబు పర్యటనల్లో జరిగిన దాడులపై రాష్ట్ర పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారన్నారు. గతంలో అమరావతి పర్యటనకు వెళ్లిన చంద్రబాబు బస్ మీద వైకాపా మూకలు రాళ్ళు, చెప్పులతో దాడి చేస్తే దాన్ని ఆనాటి డీజీపీ గౌతమ్ సవాంగ్ నిరసన తెలపడంలో భాగమని.. అది వారి



భావ ప్రకటన స్వేచ్ఛ అని ప్రకటించారని మండిపడ్డారు. నందిగామ, యర్రగొండపాలెం పర్యటనల్లో చంద్రబాబు మీద జరిగిన రాళ్ల దాడిలో ఎన్ఎస్‌జీ కమాండోల తలకు గాయాలయ్యాయని గుర్తుచేశారు. రాష్ట్ర పోలీసుల పూర్తిస్థాయి నిర్లక్ష్యం పక్షపాత ధోరణి కళ్లకు కట్టినట్లు వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తున్నాయని విమర్శించారు.

# రెవెన్యూ ఉద్యోగులపై పని భారం తగ్గించాలి



ప్రకాశం: రెవెన్యూ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగులపై తీవ్రమైన పని వత్తిడి ఉంది. ఉద్యోగాలు పని చేయలేక స్వచ్ఛంద పదవీ విరమణ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. గ్రామాల్లో రీసర్వే 15 రోజుల్లో పూర్తి చేయాలని వత్తిడి చేస్తున్నారు. కొంత మంది కలెక్టర్లు అత్యుత్సాహం ప్రదర్శించి రెవెన్యూ ఉద్యోగులపై పని భారం పెడుతున్నారు.ఎన్నికల ప్రక్రియ వత్తిడి మొత్తం కలెక్టర్లు, జేసీలు రెవెన్యూ ఉద్యోగులపై పెడుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో చిన్న చిన్న తప్పులు జరిగితే ఉద్యోగుల జీవితాలు ఏమైపోతాయో తెలియదని బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

# ప్రత్తిపాటి పుల్లారావు సహా 89 మందిపై కేసు..

పల్నాడు : మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పై కేసు నమోదైంది. పుల్లారావుతో సహా 89 మంది చిలకలూరిపేట టీడీపీ నేతలపై కేసులు నమోదయ్యాయి. చంద్రబాబును తరలిస్తుండగా సంఘీభావంగా చిలకలూరిపేటలో టీడీపీ శ్రేణులు నిరసనకు దిగాయి. కాన్వాయ్‌ను అడ్డుకుని పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కేసులు నమోదు అయ్యాయి. రోడ్డుపై గుమ్మిగూడి రాకపోకలకు అంతరాయం కలిగించారని.. దారిన వెళ్లే వాహనదారుడిపై దాడి చేశారని కూడా టీడీపీ శ్రేణులపై పోలీసులు కేసు నమోదు చేశారు. చిలకలూరిపేట పోలీసులు మొత్తం మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.





# ఒత్తిళ్లకు లొంగను.. ఆ దేవుడే దిగివచ్చినా నన్ను ప్రభావితం చేయలేడు

హైదరాబాద్: మేఘా ఇంజినీరింగ్ సంస్థ బాధ్యతల నుంచి విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ తప్పుకొన్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ఆ సంస్థ ఎండీ కృష్ణారెడ్డికి పంపారు. వ్యక్తిగత కారణాల రీత్యా బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఐడీ తీరుపై పీవీ రమేశ్ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మరోవైపు మేఘా సంస్థ తనను రాజీనామా చేయాలని కోరినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తప్పుబట్టారు. తనను రాజీనామా చేయాలని ఎవరూ కోరలేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ట్విటర్ (ఎక్స్)లో పోస్ట్ చేశారు.

**దేవుడు కూడా నన్ను ప్రభావితం చేయలేడు..** "ఆ దేవుడే దిగివచ్చి చెప్పినా తప్పు చేయను.. ఒత్తిళ్లకు లొంగను. నా జీవితం మొత్తం ప్రజాసేవ కోసమే పనిచేశా. నిరంతరాయంగా.. నిస్సందేహంగా ప్రజాసేవ చేశా. జీవితంలో ఏ క్షణంలోనూ ఒత్తిళ్లకూ తలొగ్గలేదు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, వ్యాపార ఒత్తిళ్లకు అతీతంగా పనిచేశా. విస్తృత ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయాలన్నదే నా మనస్సాక్షి. దానికి విరుద్ధంగా ఆ దేవుడు కూడా నన్ను ప్రభావితం చేయలేడు" అని పీవీ రమేశ్ పేర్కొన్నారు.

# తిరుమలలో ఆగమోక్తంగా ముగిసిన ప్రధాన ఘట్టం- బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

తిరుపతి: కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులు పెద్ద సంఖ్యలో తిరుమలకు చేరుకుంటోన్నారు. 31 కంపార్ట్‌మెంట్లల్లో భక్తులు వేచి ఉంటోన్నారు. సర్వదర్శనం టోకెన్లు ఉన్న భక్తులకు దర్శనానికి 16 నుంచి 18 గంటల సమయం పడుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తోన్నారు. సోమవారం 66,199 మంది భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. వారిలో 29,351 మంది తలనీలాలను సమర్పించుకున్నారు. టీటీడీకి హుండీ ద్వారా 4.17 కోట్ల రూపాయల ఆదాయం అందింది. ఈ నెల 18వ తేదీ నుంచి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాబోతోన్నాయి. కన్నులపండువగా బ్రహ్మోత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చకచకా పూర్తి చేస్తోన్నారు టీటీడీ అధికారులు. ఇందులో భాగంగా మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఆగమోక్తంగా పూర్తి చేశారు.

**సంవత్సరంలో నాలుగుసార్లు అంటే–** ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం నాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా పూర్తి చేశారు. ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా చేశారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచారు. వర్షాలతో యూపీ అతలాకుతలం–యూపీ కేబినెట్ భేటీ–యోగి కీలక ఆదేశాలు.. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేకపూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.

# చంద్రబాబు చేసిన తప్పేమీ లేదు



అమరావతి: జగన్ రెడ్డి కళ్ళలో ఆనందం కోసం డీఐజీ రఘురాంరెడ్డి చంద్రబాబును అరెస్ట్ చేశారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు చేసిన తప్పేమీ లేదని... స్కిల్ డెవలప్మెంట్ కేసు పెద్ద కేసు కాదన్నారు. మాజీ అధికారి పీవీ రమేష్ నిన్న (సోమవారం) చేసిన వ్యాఖ్యలకు సమాధానం ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు. "నేను 16 నెలలు చంచల్ గూడా జైల్లో ఉన్నాను.. చంద్రబాబు కూడా కనీసం 16 వారాలైన జైల్లో ఉండాలి అనేది జగన్ కోరిక" అంటూ మండిపడ్డారు. నిరసనలు తెలియచెప్పే హక్కు ప్రతిపక్షాలకు లేదా అని నిలదీశారు. ఇది రాజ్యాంగ సంక్షోభం కాదా అంటూ ప్రశ్నించారు. తప్పు చేసిన అవినాష్ రెడ్డిని దర్జా బయటికి తిరిగితే.. తాము మాత్రం నిరసన తెలియచేయకూడదా అంటూ మండిపడ్డారు. కక్ష సాధింపే లక్ష్యంగా చంద్రబాబును జగన్ అరెస్ట్ చేయించారని వర్ల రామయ్య వ్యాఖ్యలు చేశారు.

## పొట్టి గౌనులో ఉస్తాద్ బ్యూటీ హొయలు..!

కావ్య కళ్యాణ్ రామ్ ఈ పేరు చెబితే చాలా మంది గుర్తుపట్టకపోవచ్చు. కానీ గంగోత్రి పాప అంటే వెంటనే గుర్తుపట్టేస్తారు. ఆ సినిమాలో వల్లంకి పిట్ట పాటలో కనిపిస్తున్న పాపే ఈ కావ్య కళ్యాణ్ రామ్. చైల్డ్ ఆర్టిస్ట్ గా చాలా మందికి పరిచయమే. గంగోత్రి మూవీతో కెరీర్ మొదలుపెట్టి, తర్వాత చాలా సినిమాల్లో నటించింది. ఇప్పుడు హీరోయిన్ గా సత్తా చాటేందుకు ప్రయత్నిస్తోంది. మసూద మూవీతో మొదటిసారి హీరోయిన్ గా నటించడం మొదలుపెట్టింది. ఈ మూవీ క్లిక్ అవ్వడంతో అందరి కళ్లు కావ్య కళ్యాణ్ రామ్ పై పడ్డాయి. ఆ తర్వాత వెంటనే బలగం మూవీలో నటించింది. ఆ మూవీ కూడా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఆ తర్వాత వెంటనే ఉస్తాద్ లో ఛాన్స్ వచ్చింది. అయితే, ఆ మూవీ మాత్రం పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ఇప్పటి వరకు నటించిన మూడు సినిమాల్లోనూ కావ్యకు గ్లామర్ చూపించే అవకాశం దొరకలేదు. ఎక్కువగా డీ గ్లామర్ గా, మేకప్ లేకుండా సహజంగానే నటించింది. కానీ, సోషల్



మీడియాలో మాత్రం తన అందాలతో మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. తాజాగా పింక్ కలర్ ఫ్రాక్ లో మెరిసిపోయింది. పొట్టి పింక్ కలర్ ఫ్రాక్ లో తన థైస్ తో పాటు, ఎద అందాలు కూడా కనిపించేలా ఫోజులు ఇవ్వడం విశేషం. ఈ ఫోటోలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. క్యూట్ అని కొందరు, హాట్ అని మరికొందరు కామెంట్స్ చేస్తూ, ఈ పొట్టి పిల్ల అందాలను పొగిడేస్తున్నారు. బలగం మూవీ తర్వాత కావ్య కళ్యాణ్ రామ్ ఫేట్ మారిపోయిందనే చెప్పాలి. ఆమె కు గుర్తింపు వెంటనే వచ్చేసింది. ఎక్కడికి వెళ్లినా పొట్టి పిల్ల అంటూ గుర్తు పట్టేస్తున్నారు. ఇక, మూవీల్లో ఆఫర్లు కూడా బాగానే వస్తున్నాయి. స్టార్ హీరోల సినిమాలు కాదు కానీ, యంగ్ హీరోల సినిమాల్లో అవకాశాలు వస్తున్నాయి. అయితే, టాలీవుడ్ లో మంచి హీరోయిన్ గా రాణించాలంటే మాత్రం, సాలిడ్ హిట్లు కనీసం రెండు, మూడైనా పడాలి లేకపోతే కష్టమే. బలగం హిట్ అయినా, ఆ క్రెడిట్ అంతా డైరెక్టర్ ఖాతాలోకి వెళ్లింది. కాబట్టి, ఆమె యాక్టింగ్ స్కోప్ తో పాటు గ్లామర్ స్కోప్ కూడా చూపించేలా వరస హిట్లు పడకుంటే కెరీర్ కష్టమే. అలా కాకుండా, హిట్ పడితే మాత్రం టాలీవుడ్ లో పాతుకుపోవడం మాత్రం ఖాయం. మరి, తర్వాతర్వాత కావ్యకు ఫ్యూచర్ లో ఎలాంటి ఆఫర్లు వస్తాయో చూడాలి.

## మెగాస్టార్ 156 లో రకుల్ ప్రీత్ సింగ్!

మెగాస్టార్ చిరంజీవికి హీరోయిన్లు సెట్ అవ్వడం ఇబ్బందిగా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే తమన్నా..కాజల్ అగర్వాల్..నయనతార లాంటి భామలు నటించడంతో మళ్లీ వాళ్లని రిపీట్ చేయలేని పరిస్థితి. కొత్త హీరోయిన్ తీసుకుంటే చిరంజీవికి వయసుకు మ్యాచ్ అవ్వడం కష్టం అవుతుంది. ఫాంలో ఉన్న ఏ భామని తీసుకురావలన్నా వయసు అడ్డంకిగా మారుతుంది. మరికొంత మంది హీరోయిన్లు ఆ యవసున్న హీరోలకు చెల్లెళ్లుగానూ నటించడంతో! వెంటనే వాళ్లని ఎంపకి చేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో 156..157 చిత్రాల్లో హీరోయిన్లగా ఎవరు ఎంపిక అవుతారు? అన్నది ఆసక్తికరంగా మారింది. 157వ సినిమాకి సంబంధించి అనుష్క..నయనతారని పరిశీలిస్తున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే లోపు వాళ్లిద్దరిలో ఎవరో ఒకర్ని లాక్ చేసే అవకాశం ఉంది. మరి 156వ సినిమాలో హీరోయిన్ పరిస్థితి ఏంటి? అంటే తాజాగా ఈ విషయం వెలుగులోకి వస్తుంది. ఈ సినిమాకి దర్శకుడు ఎవరు? అన్నది ఇంకా నిర్మాతలు ప్రకటించలేదు. స్వయంగా చిరంజీవి పెద్దకు మార్తె సుస్మిత ఈ చిత్రాన్ని నిర్మించడంతో ఆమె అన్ని దగ్గరుండి చూసుకుంటున్నారు. ఈ



నేపథ్యంలో మెగాస్టార కి జోడీగా రకుల్ ప్రీత్ సింగ్ ని రంగంలోకి దించే ఆలోచనలో రామ్ చరణ్ ఉన్నట్లు తెలిసింది. రకుల్ ఇప్పటికే తెలుగులో చాలా సినిమాలు చేసింది. వెల్ నోన్ పేస్. సీనియర్ భామలకు సరితూగే భామే. చరణ్ కి మంచి స్నేహితురాలు. గతంలో తని ఒరువన్ రీమేక్ లో నటించింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య స్నేహం కొనసాగుతుంది. ఇప్పుడా స్నేహంతోనే డాడ్ కి హీరోయిన్ గా రకుల్ ఒప్పిస్తున్నట్లు సమాచారం. చరణ్ మాటను ఆమె కాదనే అవకాశం లేదు. పైగా చిరంజీవితో ఛాన్ అంటే ఏ హీరోయిన్ కాదంటుంది. ప్రస్తుతం రకుల్ ప్రీత సింగ్ విశ్వనటుడు కమల్ హాసన్ సరసన 'ఇండియన్ -2' లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అందులో ఓ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్నా! రకుల్ పాత్రకి ఎ క్కువ ప్రాధాన్యత ఉంటుందని సమాచారం. ఆరకంగా తొలిసారి సీనియర్ హీరోతో రకుల్ తెరను పంచుకుంటుంది. తాజాగా చిరంజీవి సరసన షురూ చేసిందంటే? తిరుగుండదు. అటుపై నాగార్జున..బాలయ్య..వెంకటేష్ లాంటి హీరోలకు అమ్మడు ప్రమోట్ అవుతుంది. ఇప్పటికే ఓ తరం హీరోలందర్నీ అమ్మడు కవర్ చేసింది. ఆ అనుభవాన్ని రంగరించి సీనియర్లతో సై అనేస్తే సరి.




## జవాన్.. నయన్ రెమ్యునరేషన్ ఎంతంటే..



బాలీవుడ్ బాద్షా షారూక్ ఖాన్ హీరోగా నటించిన తాజా చిత్రం జవాన్. తొలిసారి షారూక్ ఓ తమిళ డైరెక్టర్ దర్శకుడు అట్లీ డైరెక్షన్ లో చేసిన సినిమా ఇది. ఈ మూవీ బాక్సాఫీసును షేక్ చేసింది. కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ మూవీలో షారూక్ ని చూపించిన విధానానికి ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఈ మూవీతో షారూక్ మరోసారి తన సత్తాను చాటాడు. ఇప్పటికే ఈ మూవీ రూ.100కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. మరింత ఎక్కువ వసూళ్లు రాబట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, ఈ మూవీలో షారూక్ సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార నటించిన విషయం తెలిసిందే. ఆమె నటనకు కూడా ప్రశంసల వర్షం కురుస్తోంది. నయన్ ఈ మూవీలో మరింత అందంగా కనిపించింది. యాక్షన్ సీన్స్ కూడా అదరగొట్టింది. పోలీసు పాత్రలో మెప్పించింది. కాగా, ఈ మూవీ విడుదల తర్వాత నయన్ కి సంబంధించిన ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. అది ఆమె రెమ్యూనరేషన్ కి సంబంధించినది కావడం విశేషం. ఈ మూవీలో నటించినందుకు గాను, నయన తార దాదాపు రూ.11కోట్లు తీసుకుందట. ఈ విషయం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. అయితే, ఆమె అంత రెమ్యూనరేషన్ తీసుకోవడంలో ఎలాంటి తప్పులేదనే కామెంట్స్ వినపడుతున్నాయి.

ఎందుకంటే, దక్షిణాదిన నయనతారకు ఎంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో స్పెషల్ గా చెప్పక్కర్లేదు. ఆమె ఇప్పటి వరకు కూడా భారీగా రెమ్యూనరేషన్ తీసుకుంది. అయితే, ఈ మూవీకి మరింత ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకున్నట్లు తెలుస్తోంది. నిర్మాతలు కూడా ఆమెకు అంత మొత్తం ఇవ్వడానికి అంగీకరించడంతోనే నయన్ ఈ మూవీలో నటించారు. కాగా, ఈ యాక్షన్ డ్రామా సినిమాకి అనిరుధ్ సంగీతం అందించారు. మ్యూజిక్ మూవీకి మరింత హెల్ప్ అయ్యింది. పాటలు కూడా బాగున్నాయి. ఇదిలా ఉండగా, ఈ మూవీ విడుదల సమయంలోనే నయనతార తొలిసారిగా ఇన్ స్టాగ్రామ్ లోకి అడుగుపెట్టారు. కాగా, ఆమె అలా అడుగుపెట్టిందో లేదో ఇలా ఫాలోవర్స్ రావడం విశేషం. కేవలం కొన్ని గంటల్లోనే ఆమెకు మిలియన్ల ఫాలోవర్స్ ఆమెను ఫాలో అయ్యారు.

## రవితేజ్ సూపర్ ప్లాన్.. గణేశ్ పండక్కి సర్ ప్రైజ్!




మాస్ మహారాజా రవితేజ ఓ పక్క సినిమాలు చేస్తూనే మరో వైపు నిర్మాతగానూ సినిమాలను నిర్మిస్తున్నారు. ఆర్టీ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై కంటెంట్ బేస్డ్ సినిమాలను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన నిర్మాణంలో తెరకెక్కుతున్న సినిమా 'ఛాంగురే బంగారురాజా'. ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ఖరారు చేసుకుంది. సాధారణంగా ఏ సినిమా అయినా శుక్రవారమే ఎక్కువగా రిలీజ్ అవుతుంటాయి. అదే ఆ వీకెండ్?కు ఓ రోజు అటు ఇటు ఏమైనా పండగలు ఉండి, సినిమా కాస్త హిట్ టాక్? తెచ్చుకుంటే బాగా కలిసొస్తుంది. అయితే ఇప్పుడు రాబోతున్న వినాయక చవితి పండగ సెప్టెంబర్? 18 సోమవారం వచ్చింది. అంటే సెప్టెంబర్ 15న శుక్రవారం. దీంతో ఆ రోజు కర్చీలు వేసేందుకు పలు సినిమాలు ట్రై చేశాయి. స్కంద, టిల్లు స్క్వేర్ సహా పలు డబ్బింగ్ చిత్రాలు రిలీజ్ డేట్‌ను ఖరారు చేసుకున్నాయి. అయితే ఇప్పుడు స్కంద, టిల్లు స్క్వేర్ వంటి పోస్ట్ పోన్ అయ్యాయి. విశాల్? మార్క్ ఆంటోని మాత్రమే వస్తోంది. దీంతో సెప్టెంబర్ 15 డేట్‌ను ఊపయోగించుకున్నారు రవితేజ. తన నిర్మాణంలో తెరకెక్కిన 'ఛాంగురే బంగారురాజా' సినిమాను వినాయక చవితి సందర్భంగా సెప్టెంబర్ 15న రిలీజ్ చేయబోతున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఓ కొత్త పోస్టర్?ను రిలీజ్ చేశారు. ఇందులో కార్తిక్?, రవిబాబు, సత్య గన్, కత్తి పట్టుకుని కనిపిస్తున్నారు. 'కేరాఫ్ కంచెరపాలెం', 'నారప్ప' ఫేమ్ కార్తిక్ రత్నం ఈ చిత్రంలో హీరోగా నటించారు. కుషితా కల్లాపు.. కార్తిక్ రత్నం సరసన హీరోయిన్‌గా నటించింది. కామెడీ సస్పెన్స్ థ్రిల్లర్?గా ఈ సినిమా రూపొందింది. సతీష్‌వర్మ దర్శకత్వం వహించారు. ఇంకా ఈ చిత్రంలో రవిబాబు, కమెడియన్? సత్య కూడా ఇతర కీలక పాత్రల్లో నటించారు. కృష్ణ సౌరభ్ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. సుందర్ ఎన్‌సి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి గతంలో టీజర్, సాంగ్స్?ను రిలీజ్ చేశారు మేకర్స్?. అవి సినిమాపై ఇంట్రెస్ట్?ను కలిగించాయి. ఇక రిలీజ్ డేట్ కూడా దగ్గరపడడంతో ట్రైలర్?ను కూడా త్వరలోనే రిలీజ్ చేయనున్నారు. చూడాలి మరి ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో..

## త్రిష కిస్సుకు నో చెప్పిన స్టార్ హీరో..!

లవ్ స్టోరీలు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. ఎందుకంటే, ప్రేమ కథలో హీరో , హీరోయిన్ల మధ్య ఉండే రొమాంటిక్ సీన్స్ ముఖ్యంగా ముద్దు సీన్లను ప్రేక్షకులు ఎక్కువగా ఆస్వాదిస్తారు. ఈ మధ్యకాలంలో యాక్షన్ సీన్స్ లోనూ రొమాంటిక్ సీన్స్ కామన్ అయిపోయాయి. ఇక ఘాటు ముద్దుల గురించి అయితే స్పెషల్ గా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక, చాలా మంది హీరోలు రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోతారు. అలాంటి అవకాశం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ ఉంటారు. అయితే, పాన్ ఇండియా స్టార్ విజయ్ సేతుపతి మాత్రం అలాంటి అవకాశం వస్తే వదులుకున్నారు. విజయ్ సేతుపతి ఎలాంటి రోల్స్ అయినా చేయగలరు. ఓ వైపు హీరో రోల్స్ చేస్తుంటారు. మరోవైపు విలన్ రోల్స్ కూడా చేస్తూ మెప్పిస్తూ ఉంటారు. అయితే, కొంతకాలం క్రితం ఆయన హీరోయిన్ త్రిష తో కలిసి 96 అనే మూవీలో నటించారు. ఇది కంప్లీట్ గా లవ్ స్టోరీ.



పదో తరగతిలో ప్రేమించుకున్న జంట తర్వాత విడిపోతారు. అలా విడిపోయిన వాళ్లు దాదాపు పదేళ్ల తర్వాత గెట్ టూ గెదర్ లో కలుసుకుంటారు. ఈ సినిమా విపరీతంగా ఆకట్టుకుంది. దీనిని తెలుగులో జాను పేరిట రీమేక్ చేశారు. కానీ, 96 క్లిక్ అయ్యినంత ఇది మాత్రం క్లిక్ కాలేదు. అయితే, ఈ మూవీలో చివరలో త్రిష, విజయ్ దేవర కొండను వదిలేసి వెళ్లిపోవాలి. ఎయిర్ పోర్టులో చివరగా వీడ్కోలు చెప్పే సమయంలో చాలా ఎమోషనల్ గా ఏడుస్తూ హగ్ చేసుకుంది. ఇది పూర్తిగా ప్రేమ కథ అయినప్పటికీ ఒక్కటి కూడా రొమాంటిక్ సీన్ ఉండదు. కానీ, డైరెక్టర్ మాత్రం ఈ మూవీ క్లైమాక్స్ లో ఓ ముద్దు సీన్ పెట్టాలని అనుకుంటున్నారట. త్రిష వెళ్లిపోయే ముందు వచ్చి, లిప్ లాక్ ఇవ్వాలి. ఈ ముద్దు ఇవ్వడానికి త్రిష కూడా అంగీకరించిందట. కానీ, విజయ్ సేతుపతి మాత్రం ఆ సీన్ చేయడానికి అంగీకరించలేదట. ఆయన అంగీకరించకపోవడంతో, ఆ సీన్ లేకుండానే సినిమా పూర్తి చేసేశారు. అయితే, ఆ సీన్ లేకున్నా, వారిద్దరూ కేవలం తమ కళ్లతోనే నటించి, మూవీ ని మరింత హైలెట్ గా నటించారు. ఇదిలా ఉండగా, విజయ్ సేతుపతి రీసెంట్ గా జవాన్ మూవీ లో విలన్ పాత్రతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు.

## శ్రియా హై గ్లామర్ డోస్.. మైండ్ బ్లోయింగ్

సీనియర్ హీరోయిన్ శ్రీయ శరణ్ హీరోయిన్ గా సినిమా అవకాశాలు అంతగా అందుకోలేకపోతున్నప్పటికీ కూడా గ్లామర్ విషయంలో మాత్రం అమ్మడు అందరిని ఆశ్చర్యపరుస్తూనే ఉంది. నేటితరం యువ హీరోయిన్స్ కు దిటుగా ఆమె తన గ్లామర్ తో సవాల్ విసురుతోంది. నాలుగు పదుల వయసు దగ్గర పడుతున్న కూడా ఇంకా పాతికేళ్ల అందంతో ఆమె ఎంతగానో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. సోషల్ మీడియాలో ఆమెకు రోజురోజుకు మరింత ఫ్యాన్ ఫాలోవర్స్ అయితే పెరుగుతున్నారు. ప్రతీ ఫ్రేమ్ లో కూడా తన గ్రామర్ హై లెవెల్ లో ఉండే విధంగా ఈ బ్యూటీ స్టిల్స్ అయితే ఇస్తుంది. ఇక రీసెంట్ గా పోస్ట్ చేసిన మరి కొన్ని ఫోటోలు చూస్తే



స్టన్ అవ్వాల్సిందే. గతంలో బికినీలో కూడా దర్శనమిచ్చిన శ్రియ ఈసారి స్కర్ట్ లో మతిపోయేలా గ్లామర్ తో ఆశ్చర్యపరిచించి. రంగురంగుల ఒక మినీ స్కర్ట్ లో అమ్మడు ఓవైపు ఎద అందాలను మరోవైపు లెగ్స్ అందాలను హైలెట్ చేస్తూ ఇచ్చిన ఫోజులు మామూలుగా లేవు. ఇక దానికి తోడు ఆమె స్మైల్ కూడా కుర్రాళ్ళను మతిపోగొట్టేస్తోంది. ఎప్పటికప్పుడు తన స్టైల్ అలాగే గ్లామర్ డోస్ విభిన్నంగా ఉండేలా ఈ బ్యూటీ జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇక ఈ ఫోటోలు నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గతంలో కంటే కాస్త సన్నబడుతున్నప్పటికీ కూడా శ్రీయ శరణ్ ఇంకా అదే గ్లో తో మెరిసిపోతోంది. ఇప్పటికీ ఆమెకు హీరోయిన్ గా కొన్ని స్పెషల్ పాత్రలకు సరైన న్యాయం చేయగలిగే సత్తా ఉన్న నటి అని చెప్పవచ్చు. ఇక ఆమెకు హీరోయిన్ గా అవకాశాలు అంతగా రావడం లేదు. ప్రస్తుతం ఆమె కొన్ని ప్రత్యేకమైన పాత్రలోనే నటించే ప్రయత్నం చేస్తుంది. కేవలం తెలుగులోనే కాకుండా ఆమెకు బాలీవుడ్ తమిళంలో కూడా ఆఫర్లు వస్తున్నాయి. ఏడాది మొదట కబ్జా సినిమాలో నటించిన అమ్మడు ఆ తర్వాత మ్యూజిక్ స్కూల్ అనే మరొక సినిమా చేసింది. కానీ అవి ఈ బ్యూటీకి అంతగా కలిసి రాలేదు. ఇక ప్రస్తుతం తమిళంలోనే ఒక సినిమా చేస్తోంది. అలాగే హిందీలో ఓ వెబ్ సిరీస్ లో కూడా నటిస్తున్నట్లు సమాచారం. మరి ఈ గ్లామర్ తో అమ్మడు మళ్ళీ వెండితెరపై హీటెక్కించేలా స్పెషల్ ఆఫర్స్ అందుకుంటుందో లేదో చూడాలి.



# అక్టోబరులో ఎన్నికలు రాకపోవచ్చు

హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబరు నెలలో నోటిఫికేషన్ రాకపోవచ్చని తెలంగాణ మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. మరో 6 నెలల తర్వాతే ఎన్నికలు ఉండొచ్చని అంచనా వేశారు. ప్రగతి భవన్‌లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల తర్వాతే దీనిపై స్పష్టత రావొచ్చన్నారు. ఒక వేళ జమిలి ఎన్నికలు వచ్చినా.. ఆరు నెలలపాటు తమ ప్రభుత్వమే ఆపద్ధర్మ ప్రభుత్వంగా ఉంటుంది కాబట్టి.. మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు అవకాశం ఉ ంటుందన్నారు. "జమిలి ఎన్నికలు ఉన్నా, లేకపోయినా మాకే లాభం. ఇటీవల అభ్యర్థులను ప్రకటించిన తర్వాత మరింత సానుకూలత వ్యక్తమవుతోంది.

కచ్చితంగా 90కిపైగా స్థానాల్లో భారాస విజయం సాధించి.. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ ఆదరణ కోల్పోయిందన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై గానీ, ఇతర నేతలపై గానీ ప్రజలకు ఏమాత్రం నమ్మకం లేదని చెప్పారు. "జాతీయ పార్టీలు దిల్లీ బానిసలు. ఆత్మగౌరవమున్న తెలంగాణ ప్రజలు బానిసత్వ పార్టీలను అంగీకరించరు. దిల్లీ బానిసలు కావాలో, తెలంగాణ బిడ్డ కావాలో రాష్ట్ర ప్రజలు తేల్చుకోవాలి. కిరణ్‌కుమార్‌రెడ్డి, కేవీపీ, షర్మిల లాంటి తెలంగాణ వ్యతిరేకులంతా ఏకమవుతున్నారు. పదేళ్ల అభివృద్ధిని తెలంగాణ వ్యతిరేకుల చేతుల్లో పెడదామా? ప్రజలే తెలుసుకోవాలి" అని కేటీఆర్ అన్నారు. కిందిస్థాయి నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్ ప్రకారం కేసీఆర్ ఈ రాష్ట్రానికి అవసరమని ప్రజలు భావిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. "పది సంవత్సరాల్లో ప్రభుత్వం అందించిన పథకాలు, సంక్షేమ పనులు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలే అద్భుతంగా వివరిస్తున్నారు. ప్రజలకు చాలా స్పష్టత ఉంది. ప్రతిపక్షాలే అయోమయంలో ఉన్నాయి. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణకు శ్రీరామరక్ష. ప్రతిపక్షాల తాపత్రయం రెండో స్థానం కోసమే. సిట్టింగ్‌లకు సీట్లు ఇవ్వకపోతే.. మా దగ్గరికి వస్తారని ప్రతిపక్షాలు భావించాయి. తాను నిర్మించిన నాయకత్వం, పార్టీ నాయకులపైన తనకున్న నమ్మకం మేరకే కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ సీట్లిచ్చారు" అని కేటీఆర్ తెలిపారు.

# పేదల ఆరోగ్య పరిరక్షణ కోసమే బస్తీ దవాఖానల ఏర్పాటు : మంత్రి తలసాని



హైదరాబాద్ : పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే బస్తీ దవాఖానలు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మంత్రి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో రెండు బస్తీ దవాఖానలు, ఆరోగ్య మహిళా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వంపెద్దపీట వేసిందన్నారు. కోట్లాది రూపాయల ఖర్చుతో ప్రభుత్వ దవాఖానలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. మహిళల ఆరోగ్యం కాపాడటం కోసం ఆరోగ్య మహిళా కేంద్రాల ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వైద్య సేవలు, మందులు, పరీక్షలు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితన తర్వాత ప్రభుత్వ దవాఖానల రూపురేఖలే మారిపోయాయని చెప్పారు. అలాగే పేద ప్రజలు అధికంగా ఉండే బస్తీలలోనే బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమలో కార్పొరేషన్ చైర్మన్‌లు ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెల నగేష్, కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు రాజకీయాలపై అనుభవం లేదు



హైదరాబాద్: మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. ఈరోజు మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దీంతో కేటీఆర్‌పై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు గాంధీ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌కు రాజకీయాలపై అనుభవం లేదు. బానిసత్వ పార్టీ ఎవరిదో తెలుస్తోంది. కేటీఆర్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాని కలిసిన తర్వాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేసు ఆగిపోయింది. కేటీఆర్‌కి కొంత నాలెడ్జ్ ఉందనుకున్నా. ఈరోజు చిట్ చాట్ తర్వాత కేటీఆర్‌కి ఏం తెలియదని అర్థమైంది.కేసీఆర్‌కి దమ్ముంటే ఆయనను బండ భూతులు తిట్టినా దానం నాగేందర్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ని క్యాబినెట్ నుంచి తీసేయాలి.మీ పార్టీ నుంచి తెలంగాణ ద్రోహులను తీసేయండి. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్ర 1% మాత్రమే. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ 115 మందిని ప్రకటించి ఒక్కొక్కరికీ 10 కోట్ల రూపాయల ఇచ్చి పంపారు. మేం తెలంగాణ ఉద్యమం చేసినప్పుడు కేటీఆర్ అమెరికాలో ఉన్నాడు.చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వకపోవడంతోనే కేసీఆర్ బయటకి వచ్చి పార్టీ పెట్టాడు. రాజశేఖర్‌రెడ్డిని ఎదిరించి మేం తెలంగాణ కోసం కొట్లాడాం.కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక అసెంబ్లీలో మాట్లాడిన మాటల రికార్డులను కేటీఆర్ వినాలి.సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ అన్నారు. సోనియా పాత్ర లేదని కేటీఆర్ అంటున్నాడు. తెలంగాణ ఉద్యమం కోసం చలించి సోనియా తెలంగాణ ఇచ్చింది.సోనియా, కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం కేటీఆర్‌కి తగదు. కాంగ్రెస్ హయాంలో ఒకటో తేదీన పింఛన్లు వచ్చేవి.బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిందో చెప్పాలి. ఎన్నికలు వస్తున్నాయనే పాలమూరు ప్రాజెక్ట ప్రారంభిస్తున్నారు. దానం నాగేందర్ కర్ర పట్టుకొని తెలంగాణ ఉ ద్యమకారులను కొట్టాడు. కేసీఆర్‌ని తిట్టిన తలసాని మంత్రి ఎలా అయ్యాడు?. తెలంగాణ ద్రోహులను నీ పార్టీలో పెట్టుకొని ఏం మాట్లాడుతున్నావ్ కేటీఆర్?. పార్లమెంట్‌లో కేసీఆర్ ఒక్కసారైనా తెలంగాణ కోసం మాట్లాడాడా?. క్యాబినెట్ మంత్రుల్లో చాలా మంది తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని వారే. సోనియా గాంధీ లేకుంటే తెలంగాణ రాకపోయేది.తెలంగాణ ఏర్పాటులో సోనియా పాత్ర లేకపోతే కేసీఆర్ కుటుంబం సోనియాని ఎందుకు కలిశారు? ఎందుకు గ్రూప్ ఫొటో దిగారు. కేసీఆర్‌ని తిట్టిన తెలంగాణ ద్రోహులు బీఆర్ఎస్‌లో ఉన్నారు.. వారిని సస్పెండ్ చేయాలి.తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీ, పద్మ దేవేందర్‌రెడ్డిలను కేసీఆర్ బానిసల్లాగా చూస్తున్నారు. మంత్రులకు అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం బానిసత్వం కాదా?. దట్టీలు కట్టడానికి తప్పా మహమూద్ అలీ దేనికి పనికిరాడు. కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా ముఖ్యమంత్రులు అవుతారు. బీఆర్ఎస్ పార్టీలో ఇప్పుడు కేసీఆర్, తర్వాత కేటీఆర్, ఆ తర్వాత హిమాన్షురావు ముఖ్యమంత్రి అవుతారు. మా చెల్లిని అరెస్ట్ చేయకండి.. ఎన్నికలు ఎప్పుడైనా పెట్టుకోండని కేటీఆర్ అమిత్‌షాకి చెప్పి వచ్చాడు. కేసీఆర్ దళిత ముఖ్యమంత్రి, మూడు ఎకరాల డిక్లరేషన్ ఏమయింది? దళితబంధు, బీసీ బంధులో అక్రమాలపై కోర్టుకు వెళు ్తన్నాను" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

# మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ శ్రేణులు



వరంగల్ : బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండలం పెరకవేడు గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆహ్వానించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని వారికి విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సరైన గౌరవం లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో పెరకవేడు గ్రామ కాంగ్రెస్ నాయకులలో గారే వెంకటేష్, గారే సుకుమార్, గారే వీరయ్య, గారే రామస్వామి, బిర్రు చంద్రయ్య, బిర్రు అంజి, గారే యాకయ్య, గారే సుమన్, గారే రాములు, గారే యాకూబ్, వేల్పుల శ్రీను, అయిత యాకయ్య, అయిత వీరస్వామి, నల్ల విష్ణు, గారే వీర స్వామి, వంగాల స్వామి, వంగాల సునీల్, గారే నారాయణ, ఆరూరి వెంకట సాయిలు, వేల్పుల యాక నారాయణ తదితరులు ఉన్నారు.

# మాజీ ఎంపీ పొంగులేటి సంచలన కామెంట్స్.. ఎక్కడినుంచైన పోటీ చేస్తా..



కొత్తగూడెం : రానున్న శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటి అధికారం చేపడుతుందని ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలో మూడు జనరల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అధిష్టానవర్గం ఆదేశిస్తే ఎక్కడి నుంచైన పోటీ చేస్తానని ప్రకటించారు. విలేకర్లతో చిట్‌చాటుగా మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అధిక స్థానాల్లో విజయం సాధించేందుకు దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తాను పోటీచేసే నియోజకవర్గంతోపాటు పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, బీజేపీ శాసనసభ్యులు ఈటెల రాజేందర్‌పోటీ చేసే నియోజకవర్గాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురి చేస్తారని తెలిపారు.

తాను బీఆర్ఎస్?కు వ్యతిరేకంగా గొంతు విప్పినప్పుడే ఇబ్బందులకు గురి చేస్తారని ఊహించే అన్నింటికి సిద్ధమయ్యామని తెలిపారు. తన కంపెనీలకు సంబంధించిన కాంట్రాక్టు పనుల బిల్లులను సైతం ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, అయినప్పటికీ ముందుకు సాగుతామని ప్రకటించారు.



# రాసిపెట్టుకోండి.. పదికి పది కాంగ్రెస్ గెలుచుకోబోతోంది..

ముదిగొండ(ఖమ్మం): వచ్చే ఎన్నికల్లో ఉమ్మడిజిల్లాలో పదికి పది స్థానాలు కాంగ్రెస్ గెలుచుకోబోతోందని, బీఆర్ఎస్ మంత్రులు చెప్పేవన్నీ నీతులట, కాంగ్రెస్ నేతలు చెప్పేవన్నీ అబద్ధాలటని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముదిగొండ మండలం వెంకటాపురంలో కాంగ్రెస్‌లో చేరికల సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడారు తొలుత పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలకు ఏంచేయాలో సోనియాగాంధీ 17న హైదరాబాద్‌లో జరుగనున్న సభలో ప్రకటిస్తారన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారిని కలుపుకొని పోతూ వచ్చే ఎన్నికల్లో మధిరలోనే కాకుండా ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. బీఆర్ఎస్, సీపీఎం, బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరేవారిని స్వాగతిస్తామని, వారికి ఏకష్టం రాకుండా కాపాడుకుంటామన్నారు. ప్రాజెక్టుల గేట్లకు రంగులేసి, కాల్వల్లో పిచ్చిచెత్త తొలగించి అభివృద్ధి చేశామని చెబుతున్న కల్వకుంట్ల కుటుంబ సంస్కృతి ఏంటో ప్రజలకు తెలిసిపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రతీ అంశాన్ని తవ్వి అవినీతిపరుల అంతు చూస్తుందని హెచ్చరించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి పదిసీట్లను కాంగ్రెస్ పార్టీ గెల్చుకుంటుందని బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో పలువురు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తితో ఉన్నారన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం జిల్లా వరకు రాజకీయ పునరేకీకరణ జరుగుతోందన్నారు. మంత్రిగా మాటలు చెపుతున్న పువ్వాడ అజయ్ తొలుత గెలిచింది కూడా కాంగ్రెస్ నుంచేనని, ఆనాడు పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గెలిపించింది కూడా వైఎస్సార్ అభిమానులేనన్నారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతుకావడం ఖాయమన్నారు. అంతకుముందు ముదిగొండ నుంచి వెంకటాపురం వరకు జరిగిన ర్యాలీలో పొంగులేటి, భట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన వారికి వారు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, డాక్టర్ కోట రాంబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ ఎంపీ మందరపు నాగేశ్వరరావు, కందిమళ్ల వీరబాబు, పసుపులేటి దేవేంద్రం, దేవరపల్లి అనంత్‌రెడ్డి, రాఘవరెడ్డి, వాకదాని కన్నయ్య, జూలకంటి సంజీవరెడ్డి, బిచ్చాల బిక్షం, మండల మహిళా అధ్యక్షురాలు గుడిపూడి ఝాన్సీ పాల్గొన్నారు.

# రచ్చ రచ్చగా ఖమ్మం కాంగ్రెస్ సమావేశం.. మైక్ విసిరేసి ప్రసంగం ఆపేసిన వీహెచ్



ఖమ్మం : ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విజయభేరీ సభ సన్నాహక సమావేశం రసాబాసగా మారింది. సమావేశంలో రేణుకా చౌదరి వర్గీయులు ఆందోళనకు దిగారు. సమావేశంలో ప్రసంగిస్తున్న వి.హనుమంతరావును రేణుక వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో వీహెచ్ మైక్ విసిరేసి ప్రసంగం ఆపేశారు.

ఆ వెంటనే సమావేశం నుంచి భట్టి విక్రమార్క బయటకు వెళ్లిపోయారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సన్నాహక సమావేశంలో రేణుక చౌదరి మాట్లాడుతూ.. అందరం ఐక్యంగా పనిచేసే కాంగ్రెస్ పార్టీని అధికారం తీసుకొద్దామన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ జిల్లా అని నిరూపిద్దామన్నారు. కార్యకర్తలను వేధించారని.. ఇబ్బందులు పెట్టారని.. కష్టాలు పెట్టారని.. అవన్నీ తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు నిలబడ్డారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని రేణుక చౌదరి అన్నారు.

# కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు



ఖమ్మం జిల్లా: ఈనెల 17వ తేదీన జరగనున్న CWC సమావేశం చరిత్రలో నిలిచిపోతుందని కాంగ్రెస్ నేత భట్టివిక్రమార్క వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భట్టి మాట్లాడుతూ..హైదరాబాద్‌లో CWC సమావేశాలు నిర్వహించడం గర్వంగా ఉంది.తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్ర నాయకులంతా ఈ సమావేశంలో పాల్గొంటారు.కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పులపాలయింది.

తెలంగాణ లో వనరులు సంపద దోపిడీకి గురయ్యాయి. దొరల చేతుల్లోకి ప్రభుత్వ ఆస్తులు వెళ్లిపోయాయి.చారిత్రక డిక్లరేషన్స్ సోనియా గాంధీ ప్రకటించబోతున్నారు. నియోజకవర్గాలల్లో ఇంటింటికీ కాంగ్రెస్ నాయకులు గ్యారంటీ కార్డులు అందజేస్తారు. 17వ తేదీన జరుగనున్న సీడబ్లూసీ సభకు లక్షలాదిగా కార్యకర్తలు తరలిరావాలని భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు.

# సీనియర్ నేత డీఎస్‌కు తీవ్ర అస్వస్థత.. ఐసీయూలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి



హైదరాబాద్: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డీ. శ్రీనివాస్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గత కొంతకాలంగా ఆయన శ్వాస సంబంధిత సమస్యలతోపాటు పలు అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. డీఎస్‌కు గతంలో బ్రెయిన్ స్ట్రోక్ రావడంతోపాటు పక్షవాతం కూడా సోకింది. ఆయన పరిస్థితి విశమంగా ఉందని, ప్రత్యేక వైద్యుల బృందం చికిత్స అందిస్తున్నదని కుటుంబ సభ్యులు తెలిపారు. డీఎస్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 1948, సెప్టెంబరు 27న డీ.శ్రీనివాస్ నిజామాబాద్ జిల్లాలో జన్మించారు. హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. కాంగ్రెస్‌తో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన డీఎస్.. ఆ పార్టీలో ఉన్నత పదవులను చేపట్టారు. 1989లో నిజామాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1998లో తొలిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు. 1999లో బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణను ఓడించి రెండోసారి శాసనసభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష ఉప నాయకుడిగా పనిచేశారు. 2004, 2009లో ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2004లో టీడీపీ అభ్యర్థి సతీష్ పవార్‌ను ఓడించి నిజామాబాద్ నుంచి మూడో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో డీఎస్ ఓడిపోయారు. 2010లో జరిగిన ఉప ఎన్నికలల్లో, 2014లో నిజామాబాద్ రూరల్ నుంచి పోటీచేసి వరుసగా ఓడిపోయారు. దీంతో 2015, జూలై 2న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయనను రాజ్యసభకు నామినేట్ చేశారు. కానీ, పదవీ కాలం ముగిసే వరకు పార్టీలో కొనసాగారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీకి దూరమయ్యారు.

# కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లింది : మంత్రి ఎర్రబెల్లి

మహబూబాబాద్ : పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లోకి వలసలు వెల్లువలా వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతూనే ఉన్నారు. తాజాగా పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్న హనుమాండ్ల ఝాన్సీ సొంత గ్రామం.. తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారంతా పాలకుర్తిలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో మంగళవారం గులాబీ కండువాలు కప్పుకొని బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేకమంది నాయకులు కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నా వారి సొంత గ్రామం నుంచే అనేకమంది బీఆర్ఎస్ పార్టీలో చేరుతుండటమే ఇందుకు నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారందరికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ విజయం కోసం పనిచేయాలని వారికి సూచించారు. పార్టీలో చేరిన వారిలో ఎద్దు మల్లయ్య, మంచ భిక్షం, గజ్జి యాకయ్య, గాజు ఉప్పలయ్య, ఎద్దు అయిలయ్య, ఎద్దు వెంకన్న, ఎద్దు వెంకన్న (టైగర్), చెవుల వెంకన్న, చెవుల రమేష్, చెవుల సురేష్, మంచ శీను, మంచ రాములు, మంచ వెంకన్న, ఎద్దు కొమురయ్య, జక్కుల రాజమల్లు, ఎద్దుల లింగరాజు, జక్కుల వెంకన్న, గజ్జి నరసయ్య, గజ్జి అరువయ్య, మంచ శ్రీను, సంపెట్ట సూరి, నక్క యాదగిరి, నక్క మహేందర్, తదితరులు ఉన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com